J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 31 06.01.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఆంధ్రలో
# బిఆర్‌ఎస్‌కి డిపాజిట్లు కూడా రావు!

### కేసిఆర్ చేసిన ద్రోహం ఆంధ్రోళ్ళు అంత ఈజీగా మర్చిపోరు!!

### తన కోసం టిఆర్‌ఎస్ కొడుకు కోసం బిఆర్‌ఎస్

ఉమ్మడిరాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకి మంత్రి పదవి ఇవ్వలేదన్న కోపంతో తెలంగాణ సెంటిమెంటుతో ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తెచ్చారు ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్. తాను ఉద్యమ నాయకుడిగా తనను తాను అవతరింపచేసుకుని ఇప్పుడు కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని తరింపచేస్తున్నారు.

ఇదే క్రమంలో దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలనే సూత్రాన్ని ఆయనిప్పుడు అక్షరాలా పాటించబోతున్నారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే ఆయన కోరిక నెరవేరింది. ఇక, ఆయన కొడుకు తారక రామారావును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా చంద్రశేఖరరావు రాజకీయ పావులు కదుపుతున్నారు. ఆ ఆలోచనలో భాగంగానే బిఆర్‌ఎస్‌ను తెరపైకి తెచ్చారు.

ఒకవేళ... ఏ కారణం చేతనైనా తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి రాలేక పోతే.. కొడుకును ముఖ్యమంత్రిగా చూడాలనే కోరిక కేసీఆర్‌కు నెరవేరదు. ఒకసారి, 'ప్రగతి భవన్'ను ఖాళీచేసి, బయటకు వస్తే... ఇక ఆ ఛాయలకు సైతం వెళ్లే అవకాశం కూడా మళ్ళీ కేసీఆర్‌కి రాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఈ విషయం కేసీఆర్‌కి కూడా బాగా తెలుసు.

కేవలం కొడుకును ముఖ్యమంత్రిని చేసి, తాను ఫార్మ్‌హౌస్‌కి పరిమితం కావడం వల్ల కూడా... తెలంగాణ పౌర సమాజంలో కేసీఆర్ పూర్తిగా చులకన అయ్యే అవకాశం లేకపోలేదు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను సైతం ధీటుగా ఎదుర్కొనలేని దీనస్థితికి టీఆర్‌ఎస్ గ్రాఫ్ పడిపోతుంది.

అందుకోసమే, తాను బిజీగా ఉన్నట్టు నటించడం కోసమే జాతీయ పార్టీ పేరుతో ఒక వేదికను ఏర్పాటు చేసుకునే 'మాస్టర్ ప్లాన్'కు కేసీఆర్ తెర తీశారన్నది మేధావుల అభిప్రాయం.

10 లో

## వెంకటగిరిపై అధినేత గురి

# రామ్ ఇన్ నారాయణ అవుట్



3లో

### ఇన్‌ఛార్జ్‌గా నువ్వుంటే.. ఎమ్మెల్యేగా నేనెందుకు?
### ఎమ్మెల్యేవై.. నా బొమ్మ చూసినా నీకు భయమెందుకు??
### నేతల మధ్య మాటల యుద్ధం - ఆనంను సాగనంపడానికి పార్టీ సిద్ధం!

## రాష్ట్రంలో
# పడుకున్న ప్రతిపక్షాలని తట్టి లేపుతున్నారు!

### అడుగడుగునా అడ్డగించి ఆరిపోయిన దీపాలకి వెలుగునిస్తున్నారు!!

### అనవసరపు నిషేధాలు ప్రతిపక్షాలకు ఆయుధాలు

జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న నిషేధ విధానాలు పడుకున్న ప్రతిపక్షాలని తట్టి లేపుతున్నాయా..? జవసత్వాలు కోల్పోయిన పార్టీలకు మళ్ళీ జీవం పోస్తున్నాయా..?? చీకట్లో ఉన్న రాజకీయ శత్రువులపై లైట్లు వేసి అధికారపక్ష పెద్దలు వెలుగులోకి తెస్తున్నారా..??? గోటితో పోయే అంశాలను గొడ్డలిదాకా తెచ్చి వివాదాలు చేస్తున్నారా..???? పై ప్రశ్నలన్నిటికీ అవుననే సమాధానమే మేధావులనుండి, రాజకీయ వర్గాల నుండి వినిపిస్తోంది.

ఆమధ్య కాలంలో విశాఖలో జనసేనాని పర్య టనలో అధికారపార్టీ చేసిన హడావుడి జనసేనకి సింపతీ తెచ్చిపెట్టిందన్నది వారి అభిప్రాయం. తెలుగుదేశం పార్టీ నిర్వహించిన కందుకూరు, గుంటూరు సభలలో జరిగిన సంఘటనలను అడ్డం పెట్టుకుని రోడ్డుషోలు, ర్యాలీలు నిషేధిస్తూ తెచ్చిన జి.ఓ వల్ల ప్రభుత్వానికి లాభం కన్నా నష్టమే ఎక్కువ చేస్తుందన్నది కూడా విశ్లేషకుల వాదన. ఒంగోలులో జరపదల్చిన బాలకృష్ణ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు హోంమంత్రి అనుమతి ఇవ్వొద్దని చెప్పడం, మాజీమంత్రి, ముఖ్యమంత్రి సమీప బంధువు బాలినేని శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని మళ్ళీ అనుమతి ఇప్పించడం వంటి సంఘటనలన్నీ సొంత పార్టీ శ్రేణులను కూడా ఆలోచింపచేస్తుందని ఓ వైసీపీ నాయకుడే ఆవేదన చెందుతున్నాడు. ప్రజాస్వామ్యంలో ఉండీ లేనట్లుగా ప్రతిపక్షం ఉంటేనే అధికారపక్షం భయంతో పని చేస్తుంది. ప్రతిపక్షం ఎత్తి చూపిస్తేనే అరా కొరా లోపాలన్నా కనిపిస్తాయి. వాటిని వెంటనే సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆలా కాకుండా ప్రతిపక్షమన్న మాటే లేకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సబబు కాదన్న అభిప్రాయం సర్వత్రా వినపడుతోంది. వాస్తవానికి 2019 తరువాత ఆంధ్రాలో ప్రతిపక్షమన్న మాటే లేదని, ప్రతి చిన్న సంఘటనలోనూ బాబు నామస్మరణం చేసి వైసీపీ

10 లో



# కూచిపూడి నృత్యంలో.. శరణ్యారెడ్డి ప్రతిభ


శరణ్యారెడ్డికి బహుమతినందజేస్తున్న ఆర్‌కె రోజా

స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా ఇటీవల విజయవాడలోని కెఎల్ యూనివర్శిటీలో జరిగిన యువజనోత్సవాల్లో నెల్లూరు నగరానికి చెందిన చెన్నారెడ్డి శరణ్యారెడ్డి 'ఉషాపరిణయం' యక్షగానంలోని బాణాసుర దృశ్యాన్ని కూచిపూడి నృత్యంలో అద్భుతంగా ప్రదర్శించి ప్రథమ బహుమతినందుకుంది. రాష్ట్ర పర్యాటక శాఖ, యువజనశాఖల మంత్రి ఆర్‌కె రోజా శరణ్యారెడ్డి నాట్యప్రదర్శనను తిలకించి, ఆమెను అభినందించి ప్రథమ బహుమతిని ప్రదానం చేయడం విశేషం.

# పింఛన్లు పునరుద్ధరించండి సార్!...

- **దివ్యాంగుల ధర్నాందోళన**



జిల్లాలో అనేకమంది దివ్యాంగుల పింఛన్లను రద్దుచేయడంతో దివ్యాంగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం ఆ పింఛన్ల పునరుద్ధరణకు చర్య తీసుకుని ఆదుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకురాలు కూనపురెడ్డి అరుణ కోరారు. ఇటీవల దివ్యాంగుల ఆధ్వర్యంలో నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాందోళనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నచిన్న కారణాలు చూపుతూ దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిపనులకు పోలేక, బతకలేక, అశక్తులైన దివ్యాంగులు పడే బాధలను ప్రభుత్వం గమనించాలన్నారు. అనంతరం జేసీ కూర్మనాథ్‌కు దివ్యాంగులు ఆ మేరకు వినతిపత్రం అందజేశారు.



## సందడిగా...
# కొత్త సంవత్సర సంబరాలు

కొత్త సంవత్సరం 2023 ఆరంభమవడంతో జనవరి 1న జిల్లావ్యాప్తంగా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఇళ్ళవద్ద 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ యువత బాణసంచా వేడుకలతో సందడి చేశారు. ఉద్యోగులు ఉన్నతాధికారులకు పూల బొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. నాయకుల ఇళ్ళకు వెళ్ళి సహచరులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్ళి ఈ ఏడాది అంతా తమ జీవితాలు సుఖసంతోషాలతో సాగాలని ప్రార్థిస్తూ పూజలు చేసుకున్నారు. దీంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని అన్ని ఆలయాల్లో స్వామివార్లకు శోభాయమానంగా అలంకరణలు చేశారు. అన్ని చర్చిలు, దర్గాలు, ప్రార్థనా మందిరాల్లో కూడా నూతన సంవత్సరంలో అందరికీ సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు జరిగాయి.



# సైలెన్సర్ల కోత.. తగ్గిన 'మోత'

బైక్‌లు, తదితర వాహనాల్లో పెద్దగా శబ్దం చేస్తూ ప్రజలకు చిర్రెత్తించే సైలెన్సర్లున్న వాహనాలపై నెల్లూరు ట్రాఫిక్ పోలీసులు దృష్టిపెట్టి వాటికి అడ్డుకట్ట వేయడం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కుర్రకారు బైక్‌లలో బరబరమంటూ పెద్దగా శబ్దాలు చేసే సైలెన్సర్లతో, చెవులు చిల్లులుపడే మోతలతో వాహనాలు నడుపుతుండడం అందరికీ తెలిసిందే. ఎట్టకేలకు ఆ శబ్దకాలుష్యాన్ని నియంత్రించేందుకు ట్రాఫిక్ డిఎస్పీ ఎం.డి అబ్దుల్ సుబహాన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ పెట్టి ఇటీవల ఆ వాహనాలను గుర్తించి, వాటిలోని మోతల సైలెన్సర్‌లను తొలగించి, మామూలు సైలెన్సర్లను పెట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్ళలో వాహనాలను తనిఖీచేసి, పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లు పెట్టుకోవద్దని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నామని, ఎవరికి వారు తమ వాహనాల్లో ఇలాంటి సైలెన్సర్లు ఉంటే, వాటిని తొలగించి సాధారణ సైలెన్సర్లు పెట్టుకోవాలన్నారు.

# అర్హులైన అందరికీ..పింఛన్లు ఇవ్వాలి

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఉన్న అర్హులైనవారందరికీ పింఛన్లు ఇవ్వాలని నగరంలోని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 2న స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాందోళనలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల కొంతమంది పింఛన్లు రద్దు చేయడం దారుణమన్నారు. వెంటనే వాటన్నిటినీ పునరుద్ధరించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సయ్యద్ సిరాజ్, షానవాజ్, ఏఐవైఎఫ్ నాయకులు గౌస్, మధు, సర్దార్, జలీల్, ముత్యాలు, బాలు పాల్గొన్నారు.

# పొదలకూరులో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

పొదలకూరులో ఈనెల 6,7,8 తేదీల్లో దివంగత నాయకుడు కాకాణి రమణారెడ్డి స్మారకార్థం 5 జిల్లాల ఓపెన్ కేటగిరి షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని వినాయక షటిల్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ఈ పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని, ఆయా విభాగాల్లో విజేతలైన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తామని, వివరాలకు 94401 96425 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.


# విశిష్ట సేవలకు..'సరస్వతీ సమాజం' సన్మానం



2023 నూతన సంవత్సరారంభం సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో జనవరి 1న జరిగిన కార్యక్రమంలో, సమాజానికి నిస్వార్థంగా ఉత్తమసేవలందిస్తున్న ఇద్దరు విశిష్ట వ్యక్తులకు ఆత్మీయ సన్మానాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణకు వేలాది మొక్కలు నాటుతూ, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలు చేస్తున్న విఆర్‌సి విశ్రాంత అధ్యాపకులు కొండా వెంకట స్వామిరెడ్డిని, ఇటీవల స్విమ్మింగ్ పోటీల్లో బంగారుపతకాలు సాధించిన సరస్వతి సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్యను సన్మానించారు. సభాధ్యక్షులుగా కెఎస్‌ఆర్ ఆంజ నేయులు వ్యవహరించారు. ప్రముఖ సంఘసేవకులు.. రక్తదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, 'సంఘమిత్ర' విద్యాసంస్థల అధినేత కె.రవీంద్రరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సరస్వతీ సమాజం కార్యదర్శి టి.రమణయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, సరస్వతీ సమాజం కోశాధికారి యడవల్లి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఎస్ఐ బాల కోటేశ్వరరావు, బండ్ల రమణయ్య, తెలుగు భాషోద్యమ సమితి నాయకులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఈ కార్యక్రమానికి చేయూతనందించిన వి.శ్రీధర్, పెన్నా రచయితల సంఘం(పెరసం) ప్రతినిధులు మోపూరు పెంచల నరసింహం, అవ్వారు శ్రీధర్‌బాబు, సుభద్రాదేవి, ములుగు లక్ష్మీమైథిలి, గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణ, పినాకిని స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తిరస ప్రపూర్ణం.. 'చీమకుర్తి' వారి.. 'పద్యాభిషేకం'

కవిపండితుడు, ఆధ్యాత్మికవేత్త..విద్వాన్ చీమకుర్తి వెంకటేశ్వరరావు రచించిన 'పద్యాభిషేకం' అనే చిన్ని పుస్తకం ఆద్యంతం భక్తిరస ప్రపూర్ణం. ఈ రచనలో కవి మొదట 'శివస్తుతి' చేసి, పిదప 'తిరుప్పావై' పాశురాలను అనువదించి శివకేశవ సమానత్వాన్ని ప్రదర్శించారు. శివుని స్తుతిస్తూ రచించిన పద్యాలు శివతత్వాన్ని చక్కగా వివరిస్తున్నాయి. శివుని నిరాడంబరత్వాన్ని వివరిస్తూ 'నాగరాజులె నీకు నాణెంపు నగలాయె/ మూడు కన్నుల సామి మ్రొక్కుచుంటి'.. అంటూ రాసిన పద్యం ఆయన కవితా ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ పద్యంలో 'విభూతియే భూతి అని, దిక్కులే ఆ జంగమయ్యకు వస్త్రాలని, అభిషేకమే ఆ పరమేశ్వరునికి ప్రియమని' వర్ణిస్తూ, శివపూజ భక్తులకు ఎంత సులభతరమో వివరించారు. వివిధ రకాలైన ఛందస్సులతో పద్యాలను రాయడమే కాక, ఆయా పేర్లలో ఉండే శ్లేషార్థాలను స్ఫురింపజేయడం పద్యరచనలో కవి నైపుణ్యానికి మచ్చుతునక.




**పద్యాభిషేకం**
సంపాదకులు:
**డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు**
వెల. అమూల్యం పేజీలు: 58
ప్రతులకు : డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు
యస్.10, పి.టి.జి. రాజ్‌టవర్స్,
రేబాలవారివీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు - 2.
సెల్ : 99088 55294

భగవంతుని పూజకు కేవలం పుష్పాలు ముఖ్యం కాదని, మనసులోని కల్మషాలను తొలగించుకుని చేసే నిర్మలమైన పూజే నిజమైన పూజ..అని తెలియజెప్పడం, అహింస- భూతదయ-ఇంద్రియ నిగ్రహం-శాంతి-సత్యం..ఇవన్నీ అసలైన పూజాపుష్పాలని పేర్కొనడం, త్రికరణశుద్ధిగా చేసే పూజలే సత్ఫలితాలనిస్తాయని చెప్పడం వంటివన్నీ కవికి ఆ భగవంతుని పట్ల ఉన్న అపారమైన భక్తికి ప్రతీకగా కనిపిస్తాయి. ఇందులో శివభక్తి సంబంధమైన అనేక కథలు కూడా ఎంతో ఆసక్తిగొలిపే విధంగా ఉన్నాయి.

రెండవభాగంలో..గోదాదేవి తమిళంలో రచించిన పాశురాలను చక్కని పద్యాలుగా తెలుగులోకి అనువదించి మనకందించారు చీమకుర్తి వారు.

మ// పెరియాళ్వారుల దైవదత్త సుతయై పెంపొందె నాండాళనన్
దరహాసోజ్వల చారు చంద్రముఖి గోదాదేవి, శ్రీకృష్ణునిన్
వరుగా గోరి వ్రతంబొనర్చె గురుసేవన్ మార్గశీర్షంబునన్
తిరమౌ భక్తి దలంచె గోపిక వలెన్ దివ్యాత్మ సద్భావనన్!...

తే.గీ// 'నందనందనుడైన గోవిందు జూడ
ప్రీతిజేసిరి వ్రతము గోపికలు నాడు
వారి మార్గాన పయనించి వాసుదేవు
మనసు గెల్వంగ తా ధనుర్మాసమందు
వ్రతము సేసె గోదాదేవి పతిగ గోరి'..

అంటూ సుమనోహరమైన పద్యాలలో గోపికలు ధనుర్మాస వ్రతాన్ని (సిరి నోము) అప్పట్లో ఆచరించారని, వారనుసరించిన మార్గంలో శ్రీకృష్ణుని మనసు గెలిచేందుకు ధనుర్మాసంలో గోదాదేవి తాను కూడా ఈ వ్రతాన్ని ఆచరించినట్లు మనకు స్పష్టమవుతుంది. అదేవిధంగా, 'పరుల మనసులు కష్టపడునట్లు పల్కక.. సత్కరించవలయు సజ్జనులను' అనే పద్యంలో కవి మానవీయ భావనలు అభినందనీయం.

కేవలం, భగవంతుడు తనకు చేసే పూజల వలననే సంతోషించి మనలను రక్షిస్తాడనుకోవడం కంటే, మన చేష్టలు ఇతరులను కష్టపెట్టకుండా ఉంటే..అదే భగవంతునికి ఇష్టమంటూ, మన మాటలు ఇతరులను కష్టపెట్టేవిగా ఉండకూడదని, సజ్జనులను అందరూ గౌరవించాలని, అతిథులకు.. ఆకొన్నవారికి అన్నం పెట్టి ఆదరించాలని, అలాంటి సద్భావనలతో, మంచి నియమాలతో వ్రతాన్ని నిష్ఠగా ఆచరించినప్పుడే ఆ భగవంతుడు మనలను మెచ్చుకుని అనుగ్రహిస్తాడనే సమున్నతమైన భావాన్ని ప్రతిపాదిస్తున్న ఈ పద్యం.. బహు హృద్యం. మొత్తమ్మీద ఈ పుస్తకం చూసేందుకు చిన్నదే అయినా, ఇందులో ఉన్న విషయాలు ఎంతో గొప్పవి. 'వెల లేని' గొప్ప భావాలెన్నో 'అమూల్యమైన' ఈ పుస్తకంలో మనల్ని ఆకట్టుకుంటాయి. భగవద్భక్తితో పాటు, అందరూ ఆచరించదగిన మంచి విషయాలెన్నో ఇందులో ఉన్నాయి. ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమిది. ముఖ్యంగా ఆస్తిక మహాశయులందరూ ఈ పుస్తకాన్ని అనునిత్యం పఠించి.. ఆ భగవంతుని అనుగ్రహం పొందుదురు గాక!....



సమీక్షకులు :
**విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు**
నెల్లూరు. ఫోన్: 91829 30795

# రామ్ ఇన్.. నారాయణ అవుట్!



గత పదిరోజులుగా వెంకటగిరి నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో నెల్లూరు–తిరుపతి జిల్లాల రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జగన్ ప్రభుత్వంపై ప్రత్యక్షంగా, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై పరోక్షంగా వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామ నారాయణరెడ్డి చేసిన విమర్శలు పెను దుమారాన్నే లేపాయి. ఓ వైపు ఇద్దరు నేతలు నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో విమర్శలు చేసుకుంటుంటే, మరోవైపు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని రామ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ఆయనని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించారు. ఇక్కడితో అప్పటివరకు నియోజకవర్గంలో ఆధిపత్యం చెలాయిస్తున్న ఆనం రామనారాయణరెడ్డిని పక్కన పెట్టినట్లుగా స్పష్టమైన సంకేతాలు వచ్చేశాయి. వీరిద్దరి యుద్ధం సందర్భంగా ఆనంను సాగనంపడానికి పార్టీ సిద్ధమయ్యిందన్న విషయం స్పష్టమైపోయింది.



## వివాదానికి తెరలేపిన ఆనం రామనారాయణరెడ్డి

గత కొంత కాలంగా ఆనం రామ నారాయణరెడ్డి సొంత పార్టీకి వ్యతిరేకంగా అప్పుడప్పుడూ గళం విప్పుతూనే ఉన్నారు. నేరుగా పార్టీపైన, పార్టీ విధానాలపైనా విమర్శలు గుప్పిస్తూనే వస్తున్నారు. ఆయన పార్టీ వీడిపోతారన్న అనుమానాలు కలిగేలా ప్రవర్తిస్తూ వస్తున్నారు. ఇదే తరుణంలో ఆయన కుమార్తె కైవల్యారెడ్డి నారా లోకేష్‌ని కలిశారు. ఆత్మకూరు నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా ఆమె పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ముమ్మరంగా జరుగుతోంది. రామనారాయణరెడ్డి విమర్శలు, కైవల్యారెడ్డి పరామర్శల నేపథ్యంలో ఆయనపైన వైసీపీ వ్యతిరేక ముద్ర పడిపోయింది.

మరో 15 నెలలలో ఎన్నికలు రానున్న తరుణంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని తిరుపతి జిల్లా అధ్యక్షుడిని చేసి బాధ్యతలు అప్పజెప్పారు జగన్. వెంకటగిరి అభ్యర్థి రామ్‌కుమార్‌రెడ్డే అన్న సంకేతాలు కూడా ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో రామనారాయణరెడ్డి స్పీడు పెంచారు, 2024 వరకూ తానే శాసనసభ్యుడినని, తానే నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తనని పేర్కొంటూ, ఒక పెద్దమనిషి నియోజకవర్గంలో జోక్యం చేసుకుంటున్నాడని, గతంలో ఒకసారి ఇక్కడినుండి పారిపోయాడని అంటూ రామ్‌కుమార్‌రెడ్డిపైన తీవ్రమైన విమర్శలు చేశారు. రామ్‌కుమార్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడైన తరువాత కూడా ప్రోటోకాల్ పాటించ కుండా, పార్టీ కార్యక్రమాల్లో కూడా ఆయన ఫోటో, పేరు లేకుండా చేశారు.

## తీవ్రంగా స్పందించిన రామ్‌కుమార్‌రెడ్డి...

స్వతహాగా సౌమ్య స్వభావం కలిగి వివాదాల జోలికి వెళ్లకుండా ఉండే రామ్‌కుమార్‌రెడ్డికి కూడా ఆనం వ్యవహారం కోపం తెప్పించింది. ఎప్పుడూ పెద్దగా స్పందించని నేదురుమల్లి పాత్రికేయుల సమావేశం పెట్టి రామనారాయణరెడ్డి విమర్శలని తీవ్రంగానే తిప్పికొట్టారు. వెంకటగిరి శాసనసభ్యుడు అన్న అక్షరాలతో పాటు మాజీమంత్రి అని ప్రచార కార్యక్రమాల్లో వాడుకుంటున్న ఆనంకి పార్టీ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడి పేరు, ఫోటో ఉండాలన్న కనీస నియమం కూడా తెలియదా...? అంటూ ప్రశ్నించారు. ఇదేం పెద్దరికం, ఇదేం సీనియారిటీ, ఇదేం మర్యాద అంటూ ఘాటైన విమర్శలు చేశారు. నువ్వు శాసనసభ్యుడివి, నువ్వే నియోజకవర్గ సమన్వయకర్తవి, మరి అలాంటప్పుడు నా పేరున్నా, నా ఫోటో అన్నా నీకు భయమెందుకు అంటూ నిలదీశారు. అధికార పార్టీ శాసనసభ్యుడిగా ఉంటూ అదే ప్రభుత్వాన్ని విమర్శించడం ఏపాటి సంస్కృతి..? అంటూ ధ్వజమెత్తారు. ఇదీ జరిగిన కథ. ఇక్కడినుండి వర్తమానంలోకి వెళ్తే....

## అయోమయానికి తెరదించిన జగన్...

వీరిద్దరి వివాదం ఆఘమేఘాలమీది తాడేపల్లికి చేరింది. విషయం తెలుసుకున్న పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించారు. పార్టీలో ఇలాంటి పోకడలను అస్సలు ఒప్పుకోని జగన్, రామనారాయణరెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్తగా తొలగించి ఆ బాధ్యతలు కూడా రామ్‌కుమార్‌రెడ్డికి అప్పజెప్పారు. ఇక్కడితో వెంకటగిరి ఓటర్లకు, అధికారులకు, పార్టీ క్యాడర్‌కి ఒక క్లారిటీ వచ్చింది. అందరి దారులు నేదురుమల్లి ఇంటివైపు మళ్లాయి. నిన్నటివరకు ఆనం ముందు నడిచిన పైలెట్లు ఆయన వెనుక ఉన్న ఎస్కార్ట్స్, ఇప్పుడు రామ్‌కుమార్‌రెడ్డి ముందూ వెనుకా పరిగెడుతున్నాయి. రాత్రికి రాత్రి సీన్ మారింది. అందుకే అంటారు రాజకీయాలలో ఏదీ శాశ్వతం కాదని.

నిజానికి రామ్‌కుమార్‌రెడ్డికి 2019 ఎన్నికలలోనే టిక్కెట్టు రావలసి ఉంది. చివరి నిముషంలో పార్టీలోకి వచ్చిన రామనారాయణరెడ్డి అది తన్నుకుపోయారు. రామ్‌కుమార్‌రెడ్డి వెంకటగిరిలో స్థానికుడు. ఆనం ఆలా కాదు, ఆయన వలసవాది. ఇప్పుడు వెంకటగిరిలో ఒక్కసారిగా రాజకీయ ముఖచిత్రం మారింది. తమకు పెద్ద దిక్కుగా తమ పెద్దాయన కొడుకు రామ్ వస్తున్నాడన్న ఆనందం సర్వత్రా కనిపిస్తోంది. మొత్తానికి ఎన్నికలెప్పుడొచ్చినా ఈ రెండు జిల్లాలకి సంబంధించిన వైసీపీ గెలుపు వెంకటగిరి నుండే మొదలవుతుందన్న మాట అక్కడ ప్రతినోటా వినిపిస్తోంది.

## ఆనం అనుయాయుల్లో అనుమానం...

ఇప్పుడు ఆనం రామనారాయణరెడ్డి అనుయాయుల్లో అనుమానాలు మొదలయ్యాయి. తమ బాస్ పార్టీ వీడడం ఖాయం అని తేలిపోయింది. ఆయన ఇప్పుడు ఎక్కడ నుండి పోటీ చేస్తారు. వెంకటగిరి తిరుపతి జిల్లా క్రిందకు వస్తుంది. ప్రస్తుత నెల్లూరు జిల్లాతో పోలిస్తే అక్కడ ఆనంకు పట్టు తక్కువే. ఈ పరిస్థితుల్లో ఆయన నెల్లూరు జిల్లా నుండి పోటీ చేయడమే ఉత్తమం అన్నది ఆయన వర్గీయుల మనోభావం. అది ఆత్మకూరా? లేక నెల్లూరు నగరమా..?? అన్నది కాలం నిర్ణయిస్తుంది.

## ఆయన రగిల్చిన అగ్గి ఆయనకే...

మొత్తంమీద ఆనం రగిల్చిన అగ్గి ఆయనకే అంటుకుంది. ఎన్నికలకు ఏడాది ముందే తాను శాసనసభ్యుడిగా ఉన్న నియోజకవర్గంలో ఆయన ఒంటరిగా మిగిలే పరిస్థితులు ఆనంకు ఏర్పడ్డాయి. ఇదే నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పోటీ చేస్తారని కూడా రాజకీయవర్గాల్లో బలంగా వినిపిస్తోంది. మరోవైపు రామ్‌కుమార్‌రెడ్డికి, ఆయన అభిమానులకు, వెంకటగిరి ప్రజలకు క్లారిటీ రావడంతో అక్కడ పార్టీని మరింత పటిష్టపరుచుకోవడానికి రామ్‌కుమార్‌రెడ్డికి బాగా సమయం దొరికినట్లుగా అయ్యింది. అంతా మన మంచికే అంటే ఇదేనేమో...!

---

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. వింజమూరులో

# 8న ఉచిత మెగా వైద్య శిబిరం

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి 8వ తేది ఆదివారం నాడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వింజమూరు నుండి కలిగిరికి వెళ్ళే దారిలో బొమ్మరాజు చెరువు ఎదురుగా ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు కాకర్ల సురేష్ కోరారు. ఉదయం 9 గంటల నుండి వైద్యశిబిరం ప్రారంభమవుతుందని, రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ-స్నాక్స్ ఏర్పాటుచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గాయనీగాయకులు గీతామాధురి, మధుప్రియ, పర్ణిక, రేణుకుమార్, మిమిక్రీ రమేష్ తదితరుల 'పాటల సందడి' కూడా ఉంటుందని తెలిపారు.

# గిరిధర్‌రెడ్డికి.. 'వైఎస్సార్ సేవాదళ్' అధ్యక్ష పదవి



## అభినందించిన శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి తాజాగా వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్ష పదవి లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఆ మేరకు పార్టీ అధిష్టానం గిరిధర్‌రెడ్డిని ఆ పదవిలో నియమిస్తూ ఈనెల 4న ఉత్తర్వులిచ్చింది. దీంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో గిరిధర్‌రెడ్డిని అభినందిస్తూ శాలువా కప్పి సన్మానించారు. నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు కూడా గిరిధర్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు.

---





శ్రద్ధాంజలి

మానవతామూర్తి, ఆత్మీయదీప్తి

మంగలపూరు రామసుబ్బమ్మ

(కీ॥శే॥ రామసుబ్బారెడ్డి గారి సతీమణి – మానమాల, ఓజిలి మండలం)

జనవరి 02, 2023 సోమవారం నాడు హైదరాబాదులో పరమపదించారు.

ఆ ప్రేమమూర్తి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు

ఎం.చంద్రశేఖర్‌రెడ్డి - ధనసేన

మనుమడు - మనుమరాలు: శ్రీచరణ్ - స్వేత

మనుమరాలు - మనుమడు: సాయిశరణ్య - శ్రీకాంత్

ముని మనుమళ్ళు

ధృవ్‌సాయి, ధీరవ్‌సాయి

ఉత్తరక్రియలు 12.01.2023 గురువారం హైదరాబాదులో జరుగును.

బంధుమిత్రులకు తెలియజేయడమైనది. ఫోన్: 98480 35456

లాయర్
జనవరి 06, 2023

# రోడ్డు ప్రమాదాలా?.. స్వయంకృతాపరాధాలా?..

కొత్త సంవత్సరారంభం రోజున అందరూ 'హ్యాపీ న్యూఇయర్' అంటూ సంబరాలు చేసుకుంటుంటే, ఢిల్లీలో ఓ యువతి కుటుంబానికి తీరని శోకమే మిగిలింది. తప్పతాగిన కొంతమంది ఇష్టం వచ్చినట్లు కారు నడుపుతూ స్కూటీని ఢీకొట్టడంతో, విధులు ముగించుకుని ఆ స్కూటీపై ఇంటికి వెళ్తున్న ఓ యువతి కారుకింద పడిపోయింది. అయినా ఆ తాగుబోతులు పట్టించుకోకుండా వేగంగా నాలుగు కిలోమీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్ళడం, ఆమె వళ్ళంతా గాయాలై విలవిలలాడుతూ ప్రాణాలు కోల్పోవడం.. దేశ వ్యాప్తంగా దుమారం రేపింది. అందులోనూ తండ్రి లేక, తల్లి, నలుగురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళకు ఆమే పెద్దదిక్కు. అలాంటి బాధ్యతగల యువతి ఎవరో కొందరు తాగుబోతుల వీరంగంతో రోడ్డుప్రమాదానికి బలైపోయింది. ఎంత దారుణం?.. ఎంత బాధాకరం?..ఆ కుటుంబాన్ని ఎవరు ఓదార్చగలరు?.. ఆమె లేని లోటును ఎవరు తీర్చగలరు?...

ఒక్క ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఇలా ప్రతిరోజూ ఎక్కడో ఒకచోటని కాదు, దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇలాంటి దుర్ఘటనలు జరిగిపోతూనే ఉన్నాయి. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఎన్నో కుటుంబాలు మృత్యువాత పడుతున్నాయి. మరికొందరు గాయాలతో వికలాంగులై జీవితాంతం బాధలు పడుతున్నారు. ప్రమాదాలు చేసిన వారిలో కొందరు మరణిస్తూనే ఉన్నారు. ఈ కేసుల్లో చిక్కుకుని ఇంకొందరు బతికినంతకాలం అవస్తలు పడుతున్నారు. ఎంతకాలమీ వేదనలు?..ఇలాంటి ఘోరాలకు అంతే లేదా?..వీటి నియంత్రణ మన చేతుల్లో లేదా?..అందరూ ఆలోచించాల్సిన తరుణమిది?.. 'ప్రమాదం' అంటే.. కర్మ కాలి.. దురదృష్టవశాత్తూ జరిగేది. అలాంటి విధిరాతను ఎవరూ తప్పించలేరు. కానీ, ఇప్పుడు విధివశాత్తూ జరిగే ప్రమాదాల కంటే, కోరి తెచ్చుకునే ప్రమాదాలే ఎక్కువవుతుండడం ఇంకా బాధాకరం. ఒక్కమాటలో చెప్పాలంటే.. అనేక రోడ్డు ప్రమాదాలు కేవలం స్వయంకృతాపరాధాలుగానే కనిపిస్తున్నాయి. అతివేగం ప్రమాదమని, మీకే కాక, ఇతరులు కూడా ప్రమాదాల బారిన పడతారు జాగ్రత్త.. అంటూ.. ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా, మీడియా అదేపనిగా పదేపదే హెచ్చరికలు చేస్తూనే ఉన్నా ఎవరూ పట్టించుకోరేం?.. ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, సీటు బెల్టులు పెట్టుకోకుండా కార్లలో కూర్చోవద్దని ఎన్నిసార్లని చెప్పాలి?..ఎవరు వింటున్నారు కనుక!.. ప్రమాదాలు జరిగాక బాధపడి ఏం లాభం?..ఇకనైనా మారండి. రోడ్డు ప్రమాదాల్లో ఎంతెంత మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారో తాజాగా కేంద్ర రోడ్డు రవాణాశాఖ 2021 సంవత్సరానికి సంబంధించిన ప్రమాదాల జాబితాను చూడండి. దేశవ్యాప్తంగా మొత్తం 4,12,432 రోడ్డు ప్రమాదాలు జరిగి, 1,53,972 మంది ప్రాణాలు కోల్పోయారంటే ప్రమాదాలెంత విపరీతంగా పెరిగాయో గమనించండి. ఈ ప్రమాదాల్లో మరో 3,84,448 మంది గాయాల పాలయ్యారట కూడా. ఇలా ఎన్ని లక్షల కుటుంబాలు విలవిలలాడుతున్నాయో ఊహించండి. రోడ్లపై గుంతల కారణంగా 1481 మంది మృత్యువాతపడితే, తాపీగా సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై 1040 మంది మరణించడం ఎంత దయనీయం?.. అంతెందుకు, సీటు బెల్టులు పెట్టుకోకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో 16,397 మంది చనిపోయారని, హెల్మెట్ పెట్టుకోనందువల్ల 46,593 మంది దుర్మరణం పాలయ్యారని కూడా నివేదిక స్పష్టం చేస్తోంది. ఇంతకన్నా మన నిర్లక్ష్యానికి, మన మొండితనానికి, మన స్వయంకృతాపరాధాలకి ఇంకా వేరే లెక్కలు కావాల్నా?.. అసలే మన గుంతలరోడ్లు వేలాదిమందిని నిత్యం మింగేస్తూనే ఉన్నాయి. అవి చాలవన్నట్లు మనమే నిర్లక్ష్యపు గుంతలు తవ్వుకుని అందులో పడడం ఎందుకూ?.. ఇకనైనా వాహనదారులు రోడ్లలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. మీరు, మీతోపాటు రోడ్లమీదున్నవారు కూడా సురక్షితంగా ఉండాలని కోరుకోవాలి. ప్రభుత్వాలు కూడా దురుసు వాహనాలపై తీసుకునే చర్యలను మరింత కఠినం చేయడమే కాక, ప్రమాదాలకు తావులేకుండా ముందుగా రోడ్లను బాగుచేయాలి.

ఏదేమైనా...వాహనాలు నడపడంలో ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దు. కోరికోరి ఎవరూ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించండి.. సురక్షితంగా, హాయిగా ప్రయాణాలు చేయండి. ఈ నూతన సంవత్సరం శుభసందర్భంగా..అందరూ వాహనాలను జాగ్రత్తగా నడుపుకుందామని, ప్రమాదాలు జరగకుండా చూసుకుందామని.. ఎవరికి వారు ప్రమాణాలు చేసుకుని మరీ.. ప్రయాణాలు చేస్తారని కోరుకుంటూ!...శుభం!.భూయాత్!..

# జన సమూహాల్లో.. జర జాగ్రత్త!



జన సమూహాల్లో కలియదిరగడమంటే అందరికీ సరదాగానే ఉంటుంది. ఎక్కడ పండుగ సంబరాలు జరిగినా, నాయకుల సభలున్నా, ఎక్కడ బాణసంచా వేడుకలు జరుగుతున్నా అక్కడికంతా వెళ్లి చూడాలనే ఆరాటం సహజమే. అయితే, అక్కడే కాదు..ఎక్కడైనా సరే, జన సమూహాల్లో తిరిగేటప్పుడు తగు జాగ్రత్తలు లేకపోతే ఇబ్బందులు తప్పవు. ప్రతిచోటా ప్రమాదాలు పొంచి ఉంటాయనే సామాజిక స్పృహ లేకుండా రాత్రనక, పగలనక ఇష్టం వచ్చినట్లు తిరిగేస్తుంటే.. ఎక్కడో ఒకచోట ప్రమాదాల బారినపడక తప్పదు. అసలే కరోనా మహమ్మారి ఎక్కడ జనం దొరుకుతారా అని నక్కినక్కి చూస్తూనే ఉంది. కోవిడ్ నాలుగో దశ(ఫోర్త్ వేవ్) పట్ల అంతా భయాందోళనలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా అనుభవాలను గుర్తుకు తెచ్చుకుని ఆ రాకాసి కోరల్లో పడకుండా ప్రభుత్వాలు చెప్తున్న నియమాలు పాటించడం అత్యవసరం. గుంపుల్లో తిరిగేటప్పుడు ఎంతో జాగ్రత్తగా మాస్కులు ధరించి, భౌతికదూరం పాటించకపోతే కరోనా అంటుకుంటే ఆ తర్వాత బాధపడి ప్రయోజనం ఉండదు. అందులోనూ సంక్రాంతి పండుగలు వస్తున్నాయి. మార్కెట్ల వద్ద జనం తోసుకోకుండా దూరం పాటించాలి. క్యూ పద్ధతే అన్నది మరిచిపోతున్నాం. ప్రతిచోటా క్యూలు ఉండేవిధంగా చూడాలి. దుకాణాల వద్ద కూడా క్యూలో ఉండి సరుకులు తీసుకునేవిధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ ఒకరు చెప్పేదేముంది?..ఎవరికి వారు తమ

## సమస్యల తో 'రణం'

భద్రత కోసం చేసుకోవాల్సిన పనులు. అదేవిధంగా, రాజకీయనాయకుల సభలు, ఊరేగింపులు, రోడ్‌షోల వంటివి ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న సందర్భాలూ ఇప్పుడు ఎక్కువవుతున్నాయి. ఒక్కసారిగా జనం తోసుకొస్తే ఎవరు మాత్రం చేయగలరు?..అని అనుకోకుండా, ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసుకుని దూరంగా ఉండాలి. తొక్కిసలాటలు జరగకుండా చూసుకోవాలి. వీధుల్లో ఏ ఊరేగింపు జరిగినా, మిద్దెలెక్కి, చెట్లు, కరెంటు స్తంభాలెక్కి కూడా చూస్తుంటారు. కొమ్మలు విరిగిపోతే ఏం కావాలి?..కొందరు పాతబడిన చప్టాలెక్కేస్తారు. అవి కూలిపోతే ఎంత ప్రమాదం?..గతంలో ఇలా జిల్లాలో ఎన్నో దుర్ఘటనలు జరిగాయి. వాటిని గుర్తుంచుకుని గుణపాఠాలుగా తీసుకోవాలి. కానీ, ఎవరూ ఇలాంటి జాగ్రత్తలను పట్టించుకోవడం లేదు. అప్పటికప్పుడు ఉరుకులు పరుగులమీద జనాల్లోకి వెళ్ళడం, ప్రమాదాలు జరిగాక కుయ్యోమొర్రోమనడం మామూలైపోయింది. పండగ సంబరాలు కదా అని, సంతోషంగా జనాల్లోకి వెళ్తే, అక్కడ ఏ బాణసంచా వేడుకలో జరుగుతుంటే చూడాలనే ఉత్సాహంతో, వాటిని కాల్చే దగ్గరగా వెళ్తే, అవి పేలిపోయి ఏ ప్రమాదం జరుగుతుందో ఎవరికి తెలుసు?.. పండుగలు, జాతరలు, తిరునాళ్ళ సందర్భాల్లో పిల్లలతో పాటు కుటుంబసభ్యులంతా వెళ్తున్నప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు తప్పిపోకుండా చూసుకోవాలి. అల్లరిమూకల ఆగడాలను ఓ కంట కనిపెట్టి ఉండాలి. ముసలివాళ్లను ఏ గుళ్ళు గోపురాలకో తీసుకువెళ్తున్నప్పుడు జనంలో వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. అందులోనూ కొందరు రోగగ్రస్తులు ఉంటారు. గబుక్కున పరుగెత్తలేని నిస్సహాయస్థితిలో ఉంటారు. మహిళలు, వృద్ధులు గుంపుల్లో తిరిగేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్లే. అదేవిధంగా, ధర్నాలు, ఆందోళనల్లో గుంపుగా వెళ్తున్నప్పుడు, ర్యాలీలు చేసేటప్పుడు, పెద్దపెద్ద ఊరేగింపుల్లో కలుస్తున్నప్పుడు మరిన్ని జాగ్రత్తలు అవసరం. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా గుంపుల్లో ఏం జరుగుతుందో చెప్పలేం. నిజానికి ప్రమాదాలు జరిగేందుకు బోలెడు కారణాలుంటాయి. ఆ కారణాలని లెక్కబెట్టి ఎవరిది తప్పు?..అని లెక్కలేసుకునేదానికంటే ముందుగా ఎవరి జాగ్రత్తలు వారు తీసుకోవడమే అన్ని వేళలా శ్రేయోదాయకం. ప్రమాదాలు జరిగిపోయాక ప్రభుత్వాలదో, అధికారులదో తప్పంటూ నిందించడం కంటే, ముందు ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవడం అన్నిటికన్నా ముఖ్యం. తస్మాత్ జాగ్రత్త!...

- సంచారి

# దేవాలయాలను ఆధునీకరించాలి!

రాష్ట్రంలో ఎన్నో పురాతన ఆలయాలు ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో తమిళ నాడు తరువాత కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మించిన చాలా చరిత్రాత్మక ఆలయాలకు మన రాష్ట్రం కూడా ప్రసిద్ధి. ఇదే క్రమంలో మన నెల్లూరుజిల్లాలో కూడా అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయి. చాలావరకు అవి శిథిలావస్థకు చేరి ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలో ఉన్న పురాతన ప్రసిద్ధ ఆలయాలపై దృష్టి పెట్టాలి. దేవాదాయ శాఖ సహకారంతో, తిరుమల తిరుపతి దేవస్థానాల సౌజన్యంతో చరిత్రాత్మక ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఇలాంటి చర్యలు చేపట్టింది. అలాంటి ఆలయాలను గుర్తించి ఒక్కొక్కటిగా వాటికి పూర్వవైభవం కల్పిస్తు వస్తోంది. ఆంధ్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో చొరవ తీసుకుని రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన ఆలయాలను గుర్తించ డానికి ఒక కమిటీని ఏర్పాటుచేసి, వాటి జీర్ణోద్ధరణకు కృషిచేస్తే బాగుంటుంది. వందల సంవత్సరాలనాటి నిర్మాణాల నాణ్యత, ఆనాటి శిల్పుల నైపుణ్యత భావితరాల వారికి తెలియచేయడంతో పాటు, హిందుత్వం యొక్క ప్రాధాన్యత, పవిత్రత గురించి కూడా చాటిచెప్పడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. పెద్దలు ఆలోచించాలి..!

కె.ఎస్.నాగరాజశర్మ, ఇందుకూరుపేట.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# పోలీసులు మందలించాలి!

నెల్లూరు నగరంలో టీ, కాఫీ సెంటర్లు గత రెండేళ్ళ కాలంలో ఒక్కసారిగా పెరిగిపోయాయి. గుంపులు గుంపులుగా జనం ఆ అంగళ్ల ముందు గుమికూడుతున్నారు. వాళ్ళ కాలక్షేపం వల్ల ఎవరికీ ఇబ్బందిలేదు. ఇక్కడ సమస్యల్లా ఒక్కటే... తమ ఇష్టానుసారంగా అడ్డదిడ్డాలుగా తమ వాహనాలు నిలిపేస్తున్నారు. షాపు నిర్వాహకులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో పోలీసుశాఖ జోక్యం చేసుకుంటే మేలు. ఎలాపడితే అలా కార్లు, మోటారుసైకిళ్ళను నిలిపిన దుకాణాల నిర్వాహకులకి భారీ జరిమానా విధించాలి. వాళ్ళకి నొప్పి తగిలితే కానీ వీళ్ళను అదుపుచేయరు. అంగళ్ళు నడిపేవారిని, బళ్ళు నిలిపే వారిని పోలీసులు మందలించాలి... తరచూ కౌన్సిలింగ్ ఇస్తుండాలి!

- ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

## అధికారులకు ఇరకాటమే..మరి

గతవారం(30.12.22) 'లాయర్'లో 'నేతలకు చెలగాటం.. అధికారులకు ఇరకాటం!' అంటూ మంచి విశ్లేషణాత్మక వార్తను ప్రచురించారు. నిజంగానే పరిస్థితి అలాగే ఉంది. ప్రతి అక్షరం.. అక్షర సత్యమే! అధికారపార్టీ నేతలతో ఉద్యోగులు, అధికారులు పడుతున్న బాధలను చక్కగా కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఇకనైనా నాయకులు వీటిని గమనించి అధికారులపై ఒత్తిడి లేకుండా వారి పని వారు చేసుకునేలా చూడగలిగితే మంచిది.

కె.లక్ష్మీప్రియ, శ్రీకాళహస్తి.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాండూస్ తుఫాన్ ప్రభావంతో ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దాదాపు 2వేల ఎకరాల్లో వరినాట్లు, నారుమళ్ళు బాగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు పడే బాధలు వర్ణనాతీతం. మళ్ళీ పంటలు వేసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండే పేదరైతులకు ఎంతో కష్టం. మరోవైపు ఎరువులు, విత్తనాలు కూడా అందరికీ అందుబాటులో ఉండడంలేదు. వాటి ధరలకు కూడా రెక్కలొస్తున్నాయి. ప్రతిఏటా ఇలాంటి బాధలు రైతులకు తప్పడం లేదు. ముఖ్యంగా జిల్లాలో ప్రధాన పంటలైన వరి, వేరుశనగ రైతులేకాక, నిమ్మ, అరటి తదితర ఉద్యాన పంటలు, తోటల రైతాంగం కూడా జోరువానల దెబ్బకు బాగా నష్టపోయింది. అధికారులు, సిబ్బంది రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఉదారంగా నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు వగైరాలను అందుబాటులో ఉండేలా చూడాలని విన్నపం.

- ఆర్.శేషయ్య, మనుబోలు.



# సాంకేతిక విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం

## రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతోషం

రాష్ట్రప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తోందని, విద్యార్థులు పోటీ ప్రపంచలో ధీటుగా నిలిచేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం విశేషకృషి చేస్తోందని రాజ్యసభ సభ్యులు, సేవా భూషణులు.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 3న నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ విద్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఆయన పంపిణీచేశారు. సాంకేతిక విద్య వైపుకు విద్యావ్యవస్థను నడిపించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించడం, అందుకవసరమైన ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు ఇవెంతో ఉపకరిస్తాయని, ఇదేవిధంగా మిగిలిన తరగతుల వారికి కూడా వీటిని పొందగలిగే అవకాశం కల్పించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తొలుత ఆయన తన సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి (న్యూఢిల్లీ) అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. సాంకేతిక విద్యను ఉపయోగించుకుని విద్యార్థులు అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఒ విటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిన్నారులు బాగా చదువుకోవాలి

## 'వాత్సల్య'లో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు



నెల్లూరులోని 'వాత్సల్య' నిరాధార బాలల ఆశ్రమాన్ని జనవరి 1న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సందర్శించి 'వాత్సల్య' బాలబాలికలు బాగా చదువుకుని సమాజంలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఇక్కడి విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయలను కలిగించేందుకు తమవంతు సహకరిస్తామన్నారు. అనంతరం ఆశ్రమంలోని వంటగదిని, డైనింగ్‌హాల్‌ను, వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఈ సందర్భంగా వారు నేర్చుకున్న పద్యాలు, భగవద్గీత శ్లోకాలను కలెక్టర్‌కు వినిపించారు. ఆశ్రమంలోని 64 మంది బాలలకు 'అమ్మ ఒడి' పథకాన్ని మంజూరు చేయించినందుకు ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆశ్రమానికి దుప్పట్లు, చిన్నారులకు నోట్‌పుస్తకాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జివి సాంబశివరావు, ఏపిజిఎఫ్ జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


## భూముల రీ-సర్వేని

# పటిష్టంగా చేపట్టాలి

జగనన్న భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రీ-సర్వే ప్రక్రియ పురోగతి, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలపై జేసీ కూర్మనాథ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సుమారు వంద సంవత్సరాల తరువాత భూముల రీ-సర్వే కార్యక్రమం జరుగుతున్నందున ఎలాంటి పొరపాట్లుకు తావు లేకుండా ఈ ప్రక్రియను అందరి సహకారంతో పటిష్టంగా చేపట్టాలన్నారు. లక్ష్యం మేరకు రీ-సర్వే పూర్తిచేసి అర్హులైన రైతులకు భూ హక్కు పత్రాలను అందచేయాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు హనుమాన్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీదేవమ్మల స్మృత్యంకంగా

# 'వాత్సల్య'కి మాలినిరెడ్డి లక్ష విరాళం



డిసెంబర్ 26, 2022న నెల్లూరులో 'నాటా సేవాడేస్' గ్రాండ్‌ఫినాలే జరిగిన విషయం 'లాయర్' పాఠకులకు తెలిసిందే. ఈ సందర్భంగా నాటా జీవిత సభ్యురాలు శ్రీమతి మాలినిరెడ్డి నెల్లూరులోని 'జనహిత వాత్సల్య'కి లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. అమెరికా దేశం, ఫ్లోరిడా రాష్ట్రం టాంప నగరంలో నివసించే మాలినిరెడ్డి అక్కడి నుండి లైవ్‌ద్వారా 'నాటా' వేడుకను తిలకిస్తూ అప్పటికప్పుడు ఫోన్ ద్వారా ఈ విరాళాన్ని ప్రకటించారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు, తమ నాన్న తుంగా రాజగోపాలరెడ్డి, అమ్మ శ్రీదేవమ్మల స్మృత్యంకంగా ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె కోరిక మేరకు 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) 2023, జనవరి 2వ తేదీన 'లాయర్' పత్రిక కార్యాలయంలో 'వాత్సల్య' కార్యనిర్వాహక సభ్యుడు సాంబశివరావుకి లక్షరూపాయల విరాళాన్ని చెక్కు ద్వారా అందజేశారు.

# 'మాండూస్' నష్టం... అంతింత కాదయా!

ఇటీవల మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాల కారణంగా జిల్లాలో అటు వ్యవసాయానికి, ఇటు తోటల రైతాంగానికి భారీ నష్టాలే వాటిల్లాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఇటీవల పంట నష్టాలను అంచనా వేసి నివేదిక అందజేశారు. జిల్లావ్యాప్తంగా 787 హెక్టార్లలో వరి, వేరుశనగ తదితర పంటలు, మరో 1289 హెక్టార్లలో ఉద్యానపంటలకు బాగా నష్టం జరిగినట్లు నివేదికలో వివరించారు. సుమారు 955 మంది రైతులు నష్టపోయారని, వీరికి కనీసం 81 కోట్ల రూపాయల దాకా నష్టం జరిగిందని, అదేవిధంగా ఉద్యాన రైతులు సుమారు 2617 మంది వర్షాలకు తోటలు దెబ్బతిని అవస్థలు పడుతున్నారని, వారికి కోటీ 96 లక్షల రూపాయల వరకు పరిహారం చెల్లించాలని అంచనా వేశారు. ఆమేరకు రైతులకు ఆర్థికసాయం, పరిహారం అందించాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు.

# 'తంగిరాల మహాభారతం' 37వ భాగం




అర్జునుడు విలువిద్య ప్రదర్శిస్తున్నప్పుడు హఠాత్తుగా రంగస్థల సింహద్వారం వద్ద భయంకరమైన శబ్దం వినవడింది. మహావీరుడు కర్ణుడు ప్రవేశించి ద్రోణాచార్యుని ఆజ్ఞతో తన కౌశలం చూపి దుర్యోధనుని ప్రశంసలు అందుకుంటాడు. కర్ణుడు అర్జునుని ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించినప్పుడు, అర్జునుడు ముందు తిరస్కరించగా, ద్రోణ, కృపాచార్యుల అనుమతితో ఇద్దరూ ద్వంద్వ యుద్ధం చేస్తున్నప్పుడు, అది తీవ్రం అవుతున్నప్పుడు కృపాచార్యుడు ఆ యుద్ధాన్ని ఆపి, కర్ణుడి కుల గోత్రాలు అడుగుతాడు. అప్పుడు దుర్యోధనుడు, కర్ణుని అంగరాజుగా పట్టాభిషేకం చేసి అతనికి యోగ్యత కల్పిస్తాడు.

కర్ణుడి తండ్రి సూతుడు. రథం దిగివచ్చి, కొడుకుని చూసి కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. అప్పుడు భీముడు, కర్ణుణ్ణి.. నీవు సూతపుత్రుడివి, వెళ్లి రథం నడుపుకొమ్మన్నప్పుడు దుర్యోధనుడు కుల ప్రస్తావన తెచ్చి, కుమారస్వామి, కృపాచార్యుడు, ద్రోణాచార్యులు, పాండవులు ఏ కులానికి చెందినవారని అడుగుతాడు. ఇంతలో సూర్యాస్తమయమై అంతటితో ప్రదర్శన ముగిస్తారు. ఆరోజు తనకి అర్జునునితో సమానమైన కర్ణుడు దొరికాడని దుర్యోధనుడు ఆనందంతో గుండెల మీద చేయి వేసుకుని సుఖంగా నిద్రిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.







# నెల్లూరు కబుర్లు

## ఫిబ్రవరిలో జిల్లాకు జగన్



వచ్చే ఫిబ్రవరిలో జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఉంటుందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 2న కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమై ఈ విషయం తెలిపారు. 'నవ రత్నాలు–పేదలందరికీ ఇళ్ళు' పథకం కింద రెండు మెగా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, ఆ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

### మాస్కులుంటేనే కార్యాలయాల్లోకి :

కరోనా కొత్త వేరియంట్ బిఎఫ్–7 విస్తరిస్తున్న నేపథ్యంలో మాస్కులు వేసుకుంటేనే ప్రభుత్వ కార్యాలయాల్లోకి ప్రజలను అనుమతించాలని, కోవిడ్ నియంత్రణకు అధికారులు ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

## పూలే దంపతులకు నివాళులు



ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న నెల్లూరు నగరంలోని మినీ బైపాస్ రోడ్‌లో గల ఆమె విగ్రహానికి, మహాత్మా జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య

## 7న సాయికృష్ణ.. 'సంగీత గేయధార'

నెల్లూరు టౌన్‌హాలులో జనవరి 7వ తేది సాయంత్రం 6 గంటల నుండి డాక్టర్ విబి సాయికృష్ణ యాచేంద్ర ఆధ్వర్యంలో 'సంగీత గేయధార' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ తెలియజేశారు. తొలుత సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కవిసమ్మేళనం ఉంటుందని, సాహిత్య–సంగీతాభిమానులు తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



నెల్లూరులోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఈనెల 3న ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం. భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి డాక్టర్ ఆకుల మహేందర్‌రెడ్డి పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయి నులు సంధ్యారాణి, మాధవి వినీత, రాశిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా జడ్జికి..కలెక్టర్ శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు జనవరి 1న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి. యామినిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## విపిఆర్ చేతులమీదుగా.. క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు జిల్లా బొందిలి సంఘం వారు జనవరి 2న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)ని నెల్లూరులోని వారి నివాసంలో కలసి, ఆయన చేతులమీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. రాష్ట్ర బొందిలి సంఘం వెల్ఫేర్ సొసైటీ ఛైర్మెన్ కిషోర్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షులు నెల్లూరు కృష్ణసింగ్, జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్‌సింగ్, కార్యదర్శి అల్లూరు నాగేంద్రసింగ్, ఉపాధ్యక్షులు వాసుదేవ్‌సింగ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీధర్‌సింగ్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ ఎం. తరుణ్‌సింగ్, కార్యవర్గసభ్యుడు భగవాన్‌సింగ్, మరియు నెల్లూరు సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రూప్–1 పరీక్షలు సజావుగా జరపండి

### - అధికారులకు జేసీ ఆదేశం



జిల్లాలో జనవరి 8వ తేదీన జరుగనున్న గ్రూప్–1 పరీక్షలకు అవసరమైన ముం దస్తు ఏర్పాట్లు చేసి, పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ లైజనింగ్ అధికార్లను, చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. ఈనెల 3న ఆయన కలెక్టరేట్‌లో ఈ పరీక్షల ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. ఈ పరీక్షలకు 6045 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వారికోసం 16 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఏపిపిఎస్‌సి వారి మార్గదర్శకాలమేరకు ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక జిల్లా అధికారిని లైజనింగ్ అధికారిగా నియమించామన్నారు. తాగు నీరు, మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా పర్యవేక్షించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, నుడా వైస్ ఛైర్మెన్ బాపిరెడ్డితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలి

### - బీజేపీ నేత మిడతల రమేష్ వినతి -

జిల్లాలో ఇటీవల భారీవర్షాల మూలంగా రాకపోకలకు అంతరాయంగా ఉన్న ప్రాంతాలలో ప్రభుత్వం వెంటనే హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించేందుకు కృషిచేయాలని బిజెపి నేత, నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా, కోవూరు–పాటూరు రోడ్డులో కోవూరు చెరువు కలుజుపై నీటి ప్రవాహం వల్ల వాహనాల రాకపోకలకు అవస్తగా ఉందని, చేజర్ల మండలం తూర్పు కంబంపాడు రోడ్డులో నల్లవాగు పొంగడంతో కంబంపాడు, కోటితీర్ధం, యనమదల, బిల్లుపాడు, కాకివాయి తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఆయన పేర్కొన్నారు. నల్లవాగుపై, పొట్టేపాలెం కలుజుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని సూచించారు. ఊటుకూరు – పల్లెపాళెం గ్రామాల మధ్య గండిని పూడ్చి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని కోరారు.



## శ్రీ రంగనాథాలయంలో వైకుంఠ ద్వారదర్శనం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 2న నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఉత్తర ద్వారదర్శనానికి భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఈ సంద ర్భంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా వేకువన 2.30 గంటలకే ఉత్తర ద్వార దర్శనానికి భక్తులను అనుమతించడం విశేషం. స్వామివారిని, అమ్మవార్లను ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి పెద్ద ఎత్తున ధనుర్మాస పూజలు నిర్వహించారు. అనంతరం, స్వామివార్లకు కన్నులపండువగా ప్రాకారోత్సవాన్ని చేపట్టారు. ఈనెల 12వ తేది వరకు కూడా భక్తులు నిత్యం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చని ఆలయ ఇఓ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా తెలిపారు.

## కిడ్నీ బాధిత విద్యార్థినికి.. 'కృష్ణచైతన్య' చేయూత

### - చికిత్స కోసం మూడున్నర లక్షల సాయం -



నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న తోట పావని అనే విద్యార్థినికి రెండు కిడ్నీలు పనిచేయక తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని కళాశాల యాజమాన్యం కృష్ణచైతన్య విద్యాసంస్థల తరఫున మూడు లక్షలా 50వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందించి తన మానవత్వాన్ని చాటుకుంది. కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు ఇటీవల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థినికి తక్షణ వైద్య చికిత్సల కోసం ఆ సాయం అందించడం అభినందనీయం. ఈ కార్యక్రమంలో డీన్ శిరీష్ బాబు, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, డిగ్రీ కాలేజీ డీన్ సుధారాణి, ప్రిన్సిపాల్ నాగయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త ఎంవిఐగా..కార్తీక్‌పవన్‌కుమార్



ప్రకాశం జిల్లా రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ మోటార్ వాహనాల అధికారిగా పనిచేస్తున్న సిహెచ్ కార్తీక్‌పవన్‌కుమార్ ఇటీవల నెల్లూరు రవాణాశాఖ ఎంవిఐ (మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్)గా నియమితులయ్యారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన రవాణాశాఖ డెప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డిటిసి) చందర్‌ను గౌరవపూర్వకంగా కలుసుకుని, విధుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా డిటిసి చందర్ ఆయన్ను అభినందించారు.

## సాయినాధునికి..విశేషపూజలు



నూతన సంవత్సరారంభం సందర్భంగా జనవరి 1న నెల్లూరులోని బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయి నాధునికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పూలు, బెలూన్లతో అందంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం సాయినాధుని ముఖచిత్రంతో క్యాలెండర్‌ను ఆవిష్క రించారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన్‌సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మందిరం గౌరవ సలహాదారులు పాబోలు రామ సుబ్బయ్య, బాబీసాయి తదితరులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులందరికీ మందిర నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించారు.



## మహిళల అభ్యున్నతే..

# ముఖ్యమంత్రి జగన్ ధ్యేయం

### కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అపారమైన కృషిచేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 3న ఆయన కోవూరులో 51 పొదుపు గ్రూప్‌ల వారికి బ్యాంక్‌ల సహకారంతో 6.84 కోట్ల రూపాయల పొదుపు రుణాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని పొదుపు మహిళలంతా ఆర్థికంగా ఎదగాలని, ఉపాధి రంగాలపై దృష్టిసారించి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం అన్ని విధాలా తోడ్పాటు నందిస్తున్నారని అన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, క్రమం తప్పకుండా తిరిగి చెల్లించి కోవూరుకు మంచిపేరు తీసుకురావాలని ఆయన లబ్దిదారులను కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు, పథకాలు అందిస్తుండడం చరిత్రాత్మకమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాకవి యోగి వేమన జయంతి..

# ఇక.. రాష్ట్ర పండుగ



ప్రజాకవి, సంఘసంస్కర్త..యోగి వేమన జయంతిని ప్రతిఏటా జనవరి 19వ తేదీన రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సచివాలయంలోని వివిధ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, జిల్లా కలెక్టరేట్లలో ఇకనుంచి యోగి వేమన జయంతిని పండుగగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు మార్గదర్శకాలు రూపొందించి అన్ని శాఖలకు పంపాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖను ప్రభుత్వం ఆదేశించింది.



# రాష్ట్రంలో.. అరాచకం తప్ప అభివృద్ధి ఏదీ?

### టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విమర్శ

ముఖ్యమంత్రిగా జగన్ వచ్చాక రాష్ట్రంలో అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. తన మూడురోజుల పర్యటనలో భాగంగా ఇటీవల ఆయన నెల్లూరుజిల్లాలోని రాజుపాళెంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌ను, వైకాపా ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. జగన్ పాలనలో 2022వ సంవత్సరం రాష్ట్రానికి విషాదాల సంవత్సరంగా మిగిలిపోయిందని, వైకాపా అధికారం చేపట్టినప్పటినుంచి ప్రజలు అన్ని రకాలుగా క్షోభను అనుభవిస్తున్నారని అన్నారు. మీడియాతో సహా, అన్ని వ్యవస్థలపై దాడి చేసి జగన్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెస్తానని, పోలవరం ద్వారా నీళ్లిస్తానని చెప్పారని, ఇప్పుడా వాగ్దానాలన్నీ ఏమయ్యాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. పోలవరం ఇప్పట్లో పూర్తయ్యేలా లేదన్నారు. జగన్, వారి ముఠా అవినీతిలో అగ్రస్థానంలో నిలిచిందని, న్యాయమూర్తులను సైతం బెదిరించిన ఘనత ఒక్క వైకాపాకే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేసి అక్రమకేసులు పెడుతున్నారన్నారు. వైకాపా వచ్చాక ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని, ఎక్కడ చూసినా ప్రజలకు సంక్షోభమే మిగిలిందన్నారు. రాష్ట్రం గంజాయి కేంద్రంగా మారిపోయిందని, మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, బీసీ ఎస్సీఎస్టీల సంక్షేమ పథకాలు రద్దయ్యాయని, విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమైందని, యువతకు ఉద్యోగాలు కరువయ్యాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కనుమరుగయ్యాయని ధ్వజమెత్తారు. దీంతో ప్రజల్లో తిరుగుబాటు వస్తోందని వైకాపాకు, జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని, రానున్న కాలంలో పెనుమార్పులు తప్పవన్నారు. ప్రజలు తమ భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ పెద్దసంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకు తరలి వస్తున్నారని, అది చూసి సహించలేక వైకాపా వాళ్ళు టిడిపిపై లేనిపోని నిందలు వేస్తున్నారని ఆయన అన్నారు. తన కందుకూరు పర్యటనలో జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన కుటుంబాలను తాము అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ బాల్ బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు

# శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు



కేరళలో ఇటీవల జరిగిన జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తృతీయ స్థానం సాధించిన ఏపీ బాల్ బ్యాడ్మింటన్ మహిళా జట్టు సభ్యులను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. శ్రీమతి స్వర్ణలత (చిత్తూరు జిల్లా)తో సహా ఇతర జట్టు సభ్యులకు, కోచ్ మరియు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీకి ఆయన తన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా, శ్రీకాళహస్తిలో జాతీయ శిబిరాన్ని నిర్వహించేందుకు అసోసియేషన్‌కు ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి వారందరూ ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# కోలాహలంగా.. అల్లూరు పోలేరమ్మ జాతర

### పోటెత్తిన భక్తజనం





భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి..చల్లనితల్లి..అల్లూరు గ్రామశక్తి.. శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. జనవరి 3వ తేది, మంగళవారం అల్లూరులో గ్రామదేవతలు..అక్కాచెల్లెళ్ళయిన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల తిరునాళ్లకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. బంగారుచీరలో మెరిసిపోతున్న పోలేరమ్మ అమ్మవారిని భక్తులంతా దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ నిండుగా మెండుగా ఉండాలంటూ అందరూ మొక్కుకున్నారు. ఈ సందర్భంగా గ్రామదేవతల ఆలయాలను పూల అలంకరణలతో శోభాయమానం చేశారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి శివప్రియమ్మతో కలసి తొలుత సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పూజలు చేసి తిరునాళ్ళను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, పలువురు ప్రముఖులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నైవేద్యాన్ని కుండల్లో మోసుకుని, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకునివచ్చి మహిళామణులు అమ్మవారికి సమర్పించారు. ఒకేసారి 1001 మంది మహిళలు అమ్మవారికి చద్ది నైవేద్యాన్ని సమర్పించడం కన్నులపండువగా ఉండింది. గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో పోతురాజు గుడివద్ద పొంగళ్లు నైవేద్యంగా సమర్పించుకున్నారు. అమ్మవార్ల తిరునాళ్లతో అన్నివీధులూ పండుగ వాతావరణంతో కళకళలాడాయి. అనంతరం అమ్మవారి ఊరేగింపు నయనానందకరంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేడుకలు అంబరాన్నంటే సంబరంగా జరిగాయి.





ॐ
V.V. Subba Rao & Family - 99497 68777
Feedback - 91544 24365

2023 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

Regd. 1991
VENKATARAMANA VILAS
Pure Vegetarian Meal Lunch-Dinner
PADMAVATI TAZA TINDI
Pure Vegetarian Coffee - Tiffins - Ice Creams

Mayuri Estd. 1994
CLOUD KITCHEN
MULTICUISINE

OUTDOOR CATERING SERVICES - Live Kitchen
Tiffins, Veg. & Non-Veg. Meals, Ice-Creams, Snacks, Chats & Fruits
Pogathota, Trunk Road, NELLORE.
Contact us : 0861 - 2307555, 79956 07772, 98660 75472

# శ్రీసిటీలో వైభవంగా.. వైకుంఠ ఏకాదశి వేడుకలు

## కళకళలాడిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం



వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 2న శ్రీసిటీ నర్సరీ ఆవరణలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో 'ఉత్తర ద్వార దర్శనం' ఏర్పాటుచేశారు. స్వామి వారి ద్వారదర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సంకల్ప పూజ, కలశస్థాపన, పుణ్యాహ వచనం తదితర పూజలతో ఆలయం కళకళలాడింది. ఉదయం నుంచి విష్ణు సహస్రనామ పారాయణం, గణపతి హోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హోమం నిర్వహించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ 'శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక' ఆధ్వర్యంలో సంప్రదాయ జానపద కళలలో ఆ ప్రాంత ప్రజల భాగ స్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ చేపట్టిన హరికథ, కోలాటం, సంక్రాంతి గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీ, గంగిరెద్దులాట కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆరూరుకు చెందిన శ్రీనివాస కోలాట బృందం, ఆరూరు దళిత వాడకు చెందిన వెంకటేష్ పెరుమాళ్ బృందం, మల్లవారిపాళెం గ్రామానికి చెందిన లక్ష్మీవల్లభ బృందం వారు కన్నుల పండువగా కోలాట నృత్యాలు చేశారు. వాద్య కళాకారులు ఆర్.శ్రీనివాసులు, టి.సుబ్రహ్మణ్యంతో కలసి పుత్తూరుకు చెందిన ఓ.రవి భాగవతార్ ఆలపించిన శ్రీనివాసకల్యాణం హరికథా పారాయణం అందరి మన్ననలు పొందింది. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు కూడా నిర్వహించి, విజేతలకు శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా బహుమతులందజేశారు. శ్రీసిటీ ఉద్యోగులతో పాటు ఆరూరు, ఆరూరు కండ్రిగ, మల్లవారిపాలెం వెస్ట్, ఇతర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు అందజేశారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగం అధిపతి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకల ఏర్పాట్లు జరిగాయి.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలో సంచలనం సృష్టించిన నగల దుకాణంలో చోరి కేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో సహకరించిన గూడూరు రూరల్ సి.ఐ జి.దశరథరామారావుకు రివార్డును అందజేస్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, గూడూరు డిఎస్పీ ఎమ్.సూర్యనారాయణరెడ్డి

## భారీగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు సీజ్

### కమిషనర్ తోట సాయినాథ్ ఆకస్మిక తనిఖీలు



ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వినియోగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ తెలిపారు. గూడూరు పట్టణం, హాస్పిటల్ రోడ్డులోని దుకాణాలలో ఆయన ఈ నెల 4వ తేదీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒక దుకాణంలో నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నట్లు గుర్తించిన మున్సిపల్ శాఖ అధికారులు ఆ వస్తువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ వ్యాపారస్తులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ వీటిని నిషేదించి సహకరించాలని కోరారు.



## మయూరి శ్యాంయాదవ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

తిరుపతి జిల్లా, గూడూరు పట్టణంలో ఈనెల 3వతేదీ సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ బి.శ్యామసుందరరావు(మయూరి శ్యాంయాదవ్) ఆధ్వర్యంలో గూడూరు రైల్వే డాక్టర్ శ్రీనివాస్ సుందర్‌కుమార్ సూచనల మేరకు గూడూరు రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రవీణ్ ఐ కేర్ నేత్ర వైద్యురాలు డాక్టర్ బి.సత్యశ్రీ మరియు నారాయణ డెంటల్ వైద్యులు డాక్టర్ యు.నారాయణలు సుమారు 150 మంది రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు ఉచితంగా నేత్రాలు, దంతాల చికిత్సలు చేశారు. స్టేషన్ మేనేజర్ పి.వెంకటేశ్వర రావు, ఆర్‌పిఎఫ్ సి.ఐ లక్ష్మీనారాయణ, ఆర్‌పిఎఫ్ ఎస్.ఐ లీలాకృష్ణ, కార్తీక్, శ్రీనివాస్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

### - డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి



చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, వాటితో ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చారు. చేవూరు విజయమోహన్‌రెడ్డి, 1వ పట్టణ ఎస్ఐ పవన్, జమాలుల్లా, అబ్దుల్‌కలాం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.












## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి స్వర్ణ కిరీటం



గూడూరు, రాజా వీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ఆలయ పాలకమండలి ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు ఇటీవల స్వామి వారికి స్వర్ణ కిరీటాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతల సహాయ సహకారాలు, సభ్యుల అండదండలతో 53 లక్షల రూపాయలు విలువ చేసే స్వర్ణ కిరీటాన్ని తయారుచేసి స్వామి వారికి అలంకరించడం జరిగిందని శ్రీకంటి తెలియజేశారు.










## అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్న
# ఘనత..సిఎం జగన్‌దే!
### మంత్రి కాకాణి



రాష్ట్రంలో వివిధ రకాల పింఛన్ల కింద రూ. 2750 నుంచి రూ. 10 వేల వరకు ప్రతినెలా ఇంటి వద్దకే చేరుస్తూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చెప్పారు. ఈనెల 2వ తేదీన ముత్తుకూరులోని ఫిషరీస్ కళాశాలలో కొత్తగా మంజూరైన సామాజిక పెన్షన్లు, పాతవారికి పెరిగిన పింఛన్‌ను అందజేసే కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వారు సూచించిన వారికి మాత్రమే పింఛన్లు మంజూరు చేసేవారని, అలాంటి పరిస్థితి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి నేరుగా వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేసే కార్యక్రమానికి సిఎం జగన్ శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంత పెద్దఎత్తున పారదర్శకంగా పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే నన్నారు. గతంలో కేవలం రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీకి సంవత్సరానికి కేవలం 4000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టేవారని, తమ ప్రభుత్వంలో ఈ మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో 62,500 కోట్లు పేదల కోసం ఖర్చుచేశారని ఆయన వివరించారు. ఈ సంవత్సరం జిల్లాలో కొత్తగా 11618మందికి పింఛన్లు మంజూరు చేశామని, ఎవరి ప్రమేయం లేకుండా, కేవలం అర్హత ఉంటే చాలు పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం వితంతువులు, వృద్ధులకు పెంచిన పెన్షన్లను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, తహశీల్దార్ మనోహర్‌బాబు, జడ్పీటిసి వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల సంఘం డైరీని..
# ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ



ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం జిల్లా కమిటీ రూపొందించిన కొత్త సంవత్సరం డైరీని జనవరి 1న జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి. హిమవతి, శ్రీనివాసరావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, పోలీసు అధికారుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రూ.78 కోట్ల విలువైన ట్యాబ్‌లు

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో విప్లవాత్మక మార్పుగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని, జిల్లాలో 22,441 మంది విద్యార్థులకు దాదాపు 78 కోట్ల రూపాయల విలువైన ట్యాబ్‌లను అందజేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతూ, విద్యార్థులకు చిన్న వయసులోనే బైజుస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీచేయడంతో వారిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 498 పాఠశాలలకు చెందిన 2880 మంది ఉపాధ్యాయులకు, 20,869 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నామని, ఒక్కో ట్యాబ్ విలువ 32 వేల రూపాయలని, 10వ తరగతికి వచ్చేవరకు ఈ ట్యాబ్‌లు వారికి ఉపయోగపడతాయని తెలిపారు.



## జొన్నవాడ ఆలయానికి..
# బంగారు సరుదు బహుకరణ

బుచ్చిరెడ్డిపాళెం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షి తాయి, గంగాదేవి అమ్మవార్లకు ఈనెల 1న దామరమడుగుకు చెందిన చింతలపల్లి శ్రీధర్‌రెడ్డి-మాధవి దంపతులు 15.560 గ్రాముల బంగారు సరుదును సమర్పించుకున్నారు. నిత్యకల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులకు అలంకరించేందుకు దాతలు ఈ ఆభరణాన్ని అందజేసినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

# అధిక ఫీజులను అరికట్టండి
### ఆర్జేడీకి విద్యార్థి నేతల వినతి



జిల్లాలో కొన్ని జూనియర్‌కళాశాలల యాజమాన్యాల వారు విద్యార్థుల వద్ద నుంచి ప్రాక్టికల్స్ పేరుతో ఎక్కువ మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తుండడం దారుణమని, అధికారులు కళాశాలలను తనిఖీ చేసి, ఇలా అధికఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపి విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి ఇటీవల ఆర్జేడీ సాయిసుబ్బారావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర జేఏసీ రాష్ట్ర కార్యదర్శి లీలామోహన్, ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నరహరి, కమలాకర్, హరీష్‌యాదవ్ తదితరులు పేర్కొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల సమస్యలు తీర్చండి
### కలెక్టర్‌ను కోరిన సంఘం నాయకులు



గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బషీర్ అహ్మద్ జిల్లా కలెక్టర్‌ను ఇటీవల కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిజిఇఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జునతో పాటు సచివాలయ ప్రభుత్వోద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మనాయుడు, బాబురావు, మోజెస్, స్నేహలత, వెంకటేశ్వర్లు, షహీనా, మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మేడా బుజ్జమ్మ స్మారకంగా..
# 9న..'మాతృమూర్తి సేవా పురస్కారాలు'

మండల కేంద్రమైన అల్లూరులో మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి 9న 'మాతృమూర్తి సేవా పురస్కారాలను' అందజేయనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాల ఆవరణంలో జరిగే ఈ కార్యక్రమానికి మేడా రామసుబ్బారెడ్డి అధ్యక్షత వహిస్తారని, ఎండిఓ సూరం శ్రీదేవి, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా, ప్రముఖ రంగస్థల-సినీనటి శివపార్వతి ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని, అవధాని కోట రాజశేఖర్ సభకు సమన్వయకర్తగా వ్యవహరిస్తారని నిర్వాహకులు మేడా మస్తాన్‌రెడ్డి, మేడా శివకుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా బుల్లా మురళీప్రసాద్‌రెడ్డి, కొప్పర్తి మల్లికార్జునబాబు, కటారి సాయికుమార్, నారా నాగభూషణం, పాపాల విజయ కుమార్‌రెడ్డిలకు మాతృమూర్తి సేవా పురస్కారాలను ప్రదానం చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం బేబి మద్దూరు సులక్షిత ప్రియధరణి బృందం జానపద నృత్యప్రదర్శన కూడా ఉంటుందని, అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# 'గౌరీభట్ల' అష్టావధానం 8న

ప్రసిద్ధ శతావధాని డా.గౌరీభట్ల మెట్టు రామశర్మ (హైదరాబాద్) వారి విశిష్ట అష్టావధానం కార్యక్రమం ఈనెల 8వ తేది ఉంటుందని పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ తెలిపారు. ఆరోజు సాయంత్రం 6.30గంటలకు నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని ఏసీహాల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, శతావధాని డా.సూరం శ్రీనివాసులు సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. తొలుత, సా.5.30 గంటల నుండి ప్రముఖ సాహితీవేత్త 'మా శర్మ' (హైదరాబాద్) ఉపన్యాసం ఉంటుందని, 'కొప్పరపు సోదరకవులు' అనే అంశంపై ఆయన ఉపన్యసిస్తారని తెలిపారు. అంతకుముందుగా మధ్యాహ్నం 4.30 గంటల నుంచి కవిసమ్మేళనం జరుగుతుందని, కవులు-సాహిత్యాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## టూకీగా...



### వేదగిరిపై..
### శ్రీ లక్ష్మీనృసింహునికి విశేష పూజలు

కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా జనవరి 1న నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైఉన్న వేదగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో స్వామి వారికి, అమ్మవారికి విశేషపూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇఓ వివి గిరికృష్ణ పర్యవేక్షించారు.

### కలిగిరిలో సెబ్ కార్యాలయం ప్రారంభం

కలిగిరి, వింజమూరు, కొండాపురం, వరికుంటపాడు మండలాలకు అనుబంధంగా వింజమూరులో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని జనవరి 1 నుంచి కలిగిరిలో ప్రారంభించారు. సెబ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బి.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

### ఏఎస్‌పేట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకుని అనుమసముద్రంపేట మండలంలోని ఏఎస్‌పేట దర్గాకు జనవరి 1న భక్తజనం తరలివచ్చి దర్గాను సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హాఫీజ్‌పాషా ప్రత్యేక ప్రార్థనలు చేసి, భక్తులను ఆశీర్వదించారు.

### పల్లిపాళెంలో..కోళ్ల పందెంరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరు రూరల్ మండలంలోని మాదరాజుగూడూరు సమీపంలోని పల్లిపాళెం గ్రామంలోని కోడిపందాల స్థావరంపై రూరల్ పోలీసులు ఇటీవల దాడులు చేసి ఇద్దరు పందెం రాయుళ్ళను అరెస్ట్ చేసి, వారినుంచి 5 బైక్‌లు, రెండు కోళ్ళను, 2,100 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

### కావలిలో సచివాలయ ఉద్యోగులకు బహుమతులు

కావలి పట్టణంలోని పలువురు సచివాలయ ఉద్యోగులకు వైకాపా నాయకులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, దామిశెట్టి సుధీర్‌నాయుడు జనవరి 1 నూతన సంవత్సరారంభం సందర్భంగా బహుమతులు అందజేసి వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారి పెసల వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### పోతిరెడ్డిపాళెంలో నీళ్ళ ట్యాంకుల పరిశీలన

కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళెంలో ఉన్న ఓవర్ హెడ్ నీళ్ళ ట్యాంకులను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ లీలాప్రకాష్ ఈనెల 2న పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నీళ్ళ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి, పరిశుభ్రం చేస్తుండాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ జగదీష్, పంచాయతి కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### వెంగారెడ్డిపాళెంలో..
### అవ్వా తాతలకు పెంచిన పింఛన్లు

సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామంలో ఈనెల 2న గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి గ్రామసభ నిర్వహించి అవ్వా తాతలకు కొత్తగా ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను అందజేశారు. పంచాయతి కార్యదర్శి లక్ష్మీలావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివశంకర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, అంగన్‌వాడీ టీచర్ సుగుణమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

### బిట్రగుంటలో దాతల సహకారంతో
### విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

బోగోలు మండలంలోని బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈనెల 2 నుంచి దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి తెలిపారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు భోజన సదుపాయం లేక ఇబ్బందులు పడేవారన్నారు. దాతలకు ఈ విషయం తెలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసేందుకు ముందుకు వచ్చారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా దాతలకు కళాశాల విద్యార్థుల తరపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# బిఆర్ఎస్‌కి డిపాజిట్లు కూడా రావు!

(మొదటి పేజీ తరువాయి)

జాతీయపార్టీ నాయకుడి హోదాలో బిల్డప్ ఇస్తూ తాను దేశమంతా తిరగాలి, కాబట్టి తన స్థానంలో తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టడానికి బిఆర్ఎస్‌ని సాకుగా చూపొచ్చున్నది కేసీఆర్ ఆలోచనగా విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

బీఆర్ఎస్‌కు జాతీయస్థాయి 'ఇమేజ్' కల్పనలో భాగంగా, ఆయన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌పై కూడా దృష్టిపెట్టారు.

ఇది కూడా తెలుగు రాష్ట్రం కావడంతో పాటు, రాజకీయ నిరుద్యోగులు, తటస్థ రాజకీయవాదులు పెద్ద సంఖ్యలో ఉండడం, వారిలో చాలామందికి కేసీఆర్ & కోతో పూర్వ పరిచయాలు ఉండడంతో ఆరంభంలోనే బీఆర్ఎస్ ఆంధ్ర శాఖ పురుడుపోసుకుంది. ఏపీ రాజకీయాలలో... 'ఫిట్ ఫర్ నథింగ్' గ్యాంగ్ ఇప్పుడు కేసీఆర్ వంక చూడడానికి కారణం లేక పోలేదు.

కేసీఆర్ వద్ద 'ధన రాశులు' పోగడి పోయి ఉన్నాయని, దేశవ్యాప్తంగా పలువురు ప్రాంతీయ నేతలు, పార్టీలకు, మీడియా సంస్థలకు భారీ ప్యాకేజీలు అందిస్తున్నారనే పుకారు రాజకీయవర్గాలలో గట్టిగా షికారు చేస్తున్న విషయం బహిరంగ రహస్యమైపోయింది.

దీంతో, తాము కూడా ఓ ట్రయల్ వేసి చూద్దామని ఏపీకి చెందిన పలువురు కుతూహల పడుతున్నారు.

అయితే, ఆంధ్రప్రదేశ్‌లో బిఆర్ఎస్ ఒక్క అసెంబ్లీ స్థానం గానీ, ఒక లోక్‌సభ స్థానం గానీ గెలవడం అనే విషయం అటుంచితే... 2014, 2019లో కాంగ్రెస్‌కు ఎదురైన అనుభవమే కేసీఆర్ పార్టీకీ ఎదురుకావడం తథ్యం అని పరిశీలకులు అంటున్నారు.

సుభిక్షంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను తన రాజకీయ స్వార్థం కోసం అటు సోనియా గాంధీ, ఇటు కేసీఆర్ ముక్క చెక్కలు చేశారనే ఆవేదన ఆంధ్ర వాసులలో నిలువెల్లా ఉంది.

పైపెచ్చు, హైదరాబాద్ జంట నగరాలలో స్థిరపడిన ఆంధ్ర వాసులను 'సెటిలర్స్' అంటూ టీఆర్ఎస్ నేతలు చిన్నచూపు చూడడం, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్ర వారిని కేసీఆర్ ఆంధ్రోళ్ళు అంటూ ఎత్తిచూపి మనవాళ్లను తీవ్ర దుర్భాషలు ఆడడం కూడా ఆంధ్రులు జీర్ణం చేసుకోలేకపోతున్నారు. కాంగ్రెస్‌ను, కేసీఆర్‌ను ఆంధ్రులు 'ఆంధ్రా ద్రోహులు'గా చూస్తున్నారు.

అయితే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో కేసీఆర్‌కు ఉన్న సఖ్యత నేపథ్యంలో... తమకు బాగానే ఉంటుందని భావిస్తున్నానని బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న నేత ఒకరు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కానీ, బిఆర్ఎస్‌కు జగన్ ఏమాత్రం అనుకూలంగా వ్యవహరించే అవకాశమే లేదని విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే, బిఆర్ఎస్ పట్ల జగన్ ఏమాత్రం మెతక వైఖరి ప్రదర్శించినా, ప్రధాని మోడీ ఆగ్రహానికి ఆయన గురికావలసి వస్తుందన్నది వారి అభిప్రాయం. అలాంటి సఖ్యతలేవీ ఉండబోవని ఇప్పటికే వైసీపీ నేతలు సంకేతాలు ఇస్తున్నారు. "వైసీపీలో సిట్టింగులు చాలామంది అక్కడ ఫిట్టింగ్ కాలేక మాతో టచ్‌లో ఉన్నారు" అని కేసీఆర్ చేసిన కామెంట్‌ని ఈ శతాబ్దపు జోక్‌గా కూడా వైసీపీ నేతలు కొట్టిపారేస్తున్నారు.

'నువ్వు ఒకందుకు పోస్తుంటే... నేను ఒకందుకు తాగుతున్నాను' అనే సామెతలా... జగన్ వ్యతిరేక ఓటు ఒకటి, రెండు శాతం చీల్చడం ద్వారా జగన్‌కు పరోక్ష సాయం చేయవచ్చని కేసీఆర్ భావిస్తుంటే... గుడ్డిలో మెల్లలా రాజకీయ అనామక జీవనం కంటే... ఎంతో కొంత చలామణిలో ఉండవచ్చునని కొందరు రాజకీయ నిరుద్యోగులు ఆయన వంక చూస్తున్నారన్నది మాత్రం రాజకీయవర్గాల నుండి వినపడుతున్న మాట.

దేశవ్యాప్తంగా బిఆర్ఎస్‌కు ఒక్క సీటు అదనంగా లభించకపోయినా, కేసీఆర్‌కు నష్టం లేదు. తెలంగాణలో అధికారం చేజిక్కించుకుని కొడుకుకి ముఖ్యమంత్రిగా పట్టాభిషేకం చేయడమే ఆయన అసలు లక్ష్యం గనుక, తెలంగాణలో పార్టీ గెలిస్తే అది నెరవేరిపోతుంది. ఆంధ్రలో డిపాజిట్లు రావడం, రాకపోవడం అనేది కేసీఆర్‌కు పెద్ద ముఖ్యం కాదు.

## తట్టి లేపుతున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

అధినాయకులు బాబుని మళ్ళీ మళ్ళీ ప్రజలకు గుర్తు చేస్తున్నారని ఒక విశ్లేషకుడు చెప్పడం గమనార్హం. రానున్న ఎన్నికలలో 175కి 175 లక్ష్యంగా ముందుకుపోతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఇలాంటి అసంబద్ధ నిషేధాలను ఆయుధాలుగా ప్రతిపక్షాలకు అందించి, ఇప్పటికే తెర మరుగైన పార్టీలను మళ్ళీ తెరముందుకు తెస్తున్నారన్నది కూడా విశ్లేషకుల ఫీలింగ్.

## యూరియా కొరత తీర్చండి

### బీజేపీ కిసాన్ మోర్చా వినతి

జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా ఎరువును వెంటనే ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4న నాయకులు నెల్లూరులోని వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్ళి, జేడీఏ సుధాకర్‌రాజును కలసి వినతిపత్రం సమర్పించారు. యూరియా కొరతతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని కిసాన్ మోర్చా అధ్యక్షుడు బుజ్జిరెడ్డి జేడీఏకి వివరించారు. కొంత మంది వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మోర్చా నాయకులు వినయ్‌నారాయణ, చక్రవర్తి, మధుసూదనరెడ్డి, సురేష్, సుబ్బారావు, కొండయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

## హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయకుమార్



హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఈదూరు విజయకుమార్ ఎన్నికయ్యారు. ఈనెల 4న విజయవాడలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన్ను రెండవసారి కూడా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం విశేషం. నెల్లూరులోని సుబేదారుపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం అధికారిగా ఈదూరు విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మళ్ళీ ఎన్నిక కావడంతో స్థానిక సంఘం నాయకులు, పలువురు హాస్టల్ అధికారులు ఆయన్ను అభినందించారు.

## 'ఆమ' AAMA చంద్రశేఖరరెడ్డికి మాతృ వియోగం!



నెల్లూరుజిల్లా వాసి, హైదరాబాదు నివాసి మంగలపూరు రామసుబ్బమ్మ తమ 93వ ఏట జనవరి రెండవతేదీ ముక్కోటి పర్వదినాన హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. ఓజిలి మండలం, మానమాల ఆమె స్వగ్రామం. భర్త రామసుబ్బారెడ్డి చాలాకాలం క్రితమే కాలం చేశారు. రైతు కుటుంబానికి చెందిన ఈ దంపతులకు చంద్రశేఖరరెడ్డి ఏకైక కుమారుడు. విజయ్ గృహోపకరణాల ఉత్పత్తుల సంస్థ అసోసియేటెడ్ మార్కెటింగ్ ఏజెన్సీస్‌లో సుదీర్ఘకాలం మార్కెటింగ్ హెడ్‌గా రెండు తెలుగు రాష్ట్రాలలో సేవలందించిన చంద్రశేఖరరెడ్డి చాలామందికి సుపరిచితుడు.

హాలో హోమ్ అప్లయన్సెస్ తయారీదారుగా కూడా చంద్రశేఖరరెడ్డి ప్రసిద్ధి. తల్లి స్ఫూర్తితో ఆమె ఆశీస్సులతో తమ స్వగ్రామం మనమాలలో సుమారు వంద అంకణాల స్థలంలో విష్ణేశ్వర ఆలయాన్ని నిర్మించారు చంద్రశేఖరరెడ్డి. ఆమె ప్రోద్బలంతోనే అదే ప్రాంగణంలో నవగ్రహాలను కూడా ఏర్పాటు చేసి తల్లి కోరికను తీర్చారు.

రామసుబ్బమ్మ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ, చంద్రశేఖరరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## అల్లాడి వేణుగోపాల్ కన్నుమూత



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, మంచి కవిమిత్రుడు, పెన్నా రచయితల సంఘం(పెరసం) కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడి వేణుగోపాల్ ఈనెల 5వ తేదిన అనారోగ్యంతో చెన్నైలో కన్నుమూశారు. చిన్న వయసులోనే గొప్ప కవిత్వం రాస్తూ, స్నేహానికి చిరునామాగా ఉంటూ.. అనేక కవి సమ్మేళనాల్లో తనదైన శైలితో కవితలు చెప్పే వేణుగోపాల్ మృతి బాధా కరమని, ఆయన లేని లోటు తీరనిదని 'పెరసం' అధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ కోసం.. కష్టపడి పనిచేయాలి

### డిసిసి అధ్యక్షుడు చేవూరు పిలుపు

నెల్లూరుజిల్లా రాజకీయాల్లో గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయని, ఈ తరుణంలో కాంగ్రెస్‌వారంతా మరింతగా కష్టపడి పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ చేవూరు దేవకుమార్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈనెల 4న విజయవాడలో జరిగిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో మారుతున్న రాజకీయ పరిస్థితులను వివరించారు. ప్రతిపక్షాల వారిపై, ప్రజల కోసం ప్రశ్నించే నాయకులపై రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం కఠినవైఖరి అవలంభిస్తుండడం దారుణమని ఆయన విమర్శించారు. జనవరి 26వ తేదీ నుంచి మార్చి 26వతేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగబోయే 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన

ప్రతిపక్షాలను కట్టడిచేయాలన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెం.1ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు నగర టిడిపి నాయకులు ఈనెల 4న నగరంలోని నర్తకి సెంటర్ వద్ద ఆందోళన చేశారు. టిడిపి నాయకుడు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సభలకు వస్తున్న జనాదరణ చూసి సహించలేక ప్రభుత్వం సభలు, సమావేశాలపై నిషేధం విధిస్తూ ఆ జిఓ జారీచేసిందని ఆయన విమర్శించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఈ ఆందోళన ప్రారంభించారు. 'యువగళం' పోస్టర్‌ను ఆవిష్కరించి, ఈనెల 27 నుంచి నారా లోకేష్‌బాబు ప్రారంభించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు ధర్మవరం గణేష్‌కుమార్, భాస్కర్, మల్లికార్జునరెడ్డి, నాగార్జున, బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆ రోజులెంతో మధురం!..

### నాటి జ్ఞాపకాలు.. నేటికీ పదిలం

### ఆత్మీయంగా.. విఆర్‌సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నెల్లూరు విఆర్ కళాశాలలో 1984-87 సంవత్సరాల మధ్య డిగ్రీ చదువుకున్న విద్యార్థులు.. దాదాపు 35ఏళ్ళ తర్వాత ఈనెల 4న కలుసుకున్నారు. ఇప్పుడు వివిధ రంగాల్లో స్థిరపడిన ఆ కళాశాల పూర్వవిద్యార్థులు సుమారు 40మంది ఆత్మీయంగా సమావేశం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని వారి కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. కళాశాలలో కలియదిరుగుతూ తమ విద్యార్థి రోజులను గుర్తుకుతెచ్చుకుని మురిసిపోయారు. ఆ సంవత్సరాల్లో వారికి పాఠాలు చెప్పిన గురువులు, విశ్రాంత అధ్యాపకులు డా. రఘురామిరెడ్డి, డా.బాబర్, డా. నరసారెడ్డి, డా. దశరథరామిరెడ్డి, డా.చంద్రబాబునాయుడు తదితరులను పూర్వవిద్యార్థులు గౌరవంగా సన్మానించుకుని వారికి తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఈ సమావేశంలో పూర్వవిద్యార్థి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు విఆర్‌సికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ఈ కాలేజీలో లక్షలాదిమంది విద్యార్థులు చదువుకుని దేశవిదేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని అన్నారు. పూర్వ విద్యార్థులు, నెల్లూరు నాయకులు, ప్రజలంతా కలసి ఈ చరిత్రాత్మకమైన కళాశాలకు పూర్వవైభవం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం, తమ సహచర విద్యార్థి.. ప్రస్తుతం నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కార్యదర్శిగా పనిచేస్తున్న అజయ్ కుమార్ 95 సార్లు రక్తదానం చేసి, ప్రముఖ రక్తదాతగా పేరొందినందుకు సంతోషిస్తూ పూర్వవిద్యార్థులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శ్రీనివాసమూర్తి, సుబ్బరాయుడు, సురేష్, మునికృష్ణ, ప్రొ.బాషా, ప్రొ.రజనీకాంత్, బివి రావు, వెంకటరమణ, రామచంద్రన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఉత్తర్వులను.. వెంటనే రద్దు చేయాలి

### వామపక్షాల నాయకుల డిమాండ్

రోడ్లపై ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదంటూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులివ్వడం దుర్మార్గమంటూ నెల్లూరులోని వామపక్ష నాయకులు మండిపడ్డారు. ఈనెల 4న నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద వారు ఆందోళన చేశారు. సిపిఎం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, సిపిఐ నాయకులు రామరాజు, ఎస్‌కె సిరాజ్, ప్రసాద్, పౌరహక్కుల సంఘం నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రజాదరణ చూసి సహించలేకనే... ర్యాలీలు, సభలపై నిషేధం

## వైకాపాపై మండిపడ్డ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న ప్రజల స్పందన చూసి ఓర్వలేకనే ప్రభుత్వం ర్యాలీలు, సభలపై నిషేధం విధించిందని, ఇదంతా వైకాపా కుట్రలో భాగమేనని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు.

ఈనెల 3న ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, నిరసనలు తెలపడం, సభలు నిర్వహించుకోవడం, ర్యాలీలు, సమావేశాలు పెట్టుకునే హక్కు అందరికీ ఉందన్నారు. ఇలాంటి నిషేధ ఉత్వర్వులు గతంలో ఉండివుంటే మన దేశానికి అసలు స్వాతంత్ర్యం వచ్చుండేది కాదేమోనని వ్యాఖ్యానించారు. రోడ్లపై నిరసన ర్యాలీలు, సభలు నిర్వహించకూడదంటూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త రూల్స్ తేవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'ఏపీ భారతదేశంలో భాగం కాదా?..ఇదేమన్నా ప్రత్యేక దేశమా!..మీ ఇష్టం వచ్చినట్లు ఉత్తర్వులు ఇవ్వడానికి ఇది నియంత పాలన కాదని గుర్తుంచుకో' అంటూ ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి అన్నారు. అధికారం చేతిలో ఉందికదా ఏదైనా చేసేస్తామనుకుంటే కుదరదన్నారు. గాంధీమహాత్ముని పోరాటమంతా రోడ్లపైనే జరిగిందన్నారు. గుజరాత్ ఎన్నికలప్పుడు ఓటేసి వచ్చిన ప్రధాని మోడీ, ఆ తర్వాత సెక్యూరిటీని పక్కనపెట్టి ప్రజలతో కలసి రోడ్డుపై నడిచారని గుర్తుచేశారు. ఏ రాజకీయనాయకుడైనా ప్రజల మధ్యనే బతుకుతాడని, ప్రజల మధ్యనే ఎదుగుతాడని అన్నారు. జగన్‌రెడ్డి మాత్రం రోడ్లపై రావాలంటే అన్ని దుకాణాలు మూయించేస్తారని, పరదాలు కడతారని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఎక్కడికి వెళ్ళినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అది చూసి సహించలేకే వైకాపా ప్రభుత్వం రోడ్లపై నిషేధాల ఉత్తర్వులిచ్చిందని, వీటిపై తాడోపేడో తేల్చుకుంటామని, టిడిపి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు.

# ఉత్తమ వైద్యులకు సన్మానం

జిల్లాలోని అయిదుగురు వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ 'ఫ్యామిలీ డాక్టర్లు'గా ఎంపిక చేసింది. నడవలేనివారికి, బాలింతలకు వారి ఇళ్ళ వద్దకే వెళ్లి వైద్య సేవలందించడంలో విశేష కృషిచేసినందుకు కలువాయి, చాకలకొండ, జగదేవిపేట, దగదర్తి, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న సురేంద్రబాబు, సృజన, సుచిత్ర, అఖిల, సయ్యద్ అయూబ్‌లను ఉత్తమ వైద్యులుగా గుర్తించి వారిని ప్రభుత్వం తరపున ఈ నెల 2న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సన్మానించి అభినందించారు. జేసీ కూర్మనాథ్, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తుత్తి 'ప్రగాఢ' సంతాపాలు.. సానుభూతులు!

ఏ రాజకీయ పార్టీకి చెందిన నేతలకైనా తమ రోజువారీ దినచర్యలో... 'సంతాప' ప్రకటనలు జారీ చేయడం ఒక ముఖ్య వ్యాపకం అయిపోయింది. ఎంఎల్‌ఏ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు... కొంచెం గుర్తింపు కలిగిన హోదా, స్థాయి కలిగిన నాయకులు ఎవరైనా... ఏ పార్టీ వారైనా... ఇలా సంతాప ప్రకటనలు జారీ చేయడం సహజం. ఇది కూడా 'ప్రజా సేవ' కిందకే వస్తుంది. ఆయా సందర్భాల్లో.... క్షణాలపై సంతాపం వ్యక్తం చేయకపోవడాన్ని కూడా రాజకీయ ప్రత్యర్థులు వేలెత్తి చూపిస్తున్నారు. మొన్నీమధ్య 'కందుకూరు తొక్కిసలాట'లో ఎనిమిది మంది మృతి చెందిన సమయంలో ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో ఉన్నారు. ఆయన ఈ సంఘటనపై తక్షణమే 'ప్రగాఢ' సంతాపం తెలుపలేదంటూ చంద్రబాబునాయుడు విమర్శించారు.

గత శుక్రవారం తెల్లవారు ఝామున మన ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి హీరాబెన్ తనువు చాలించారు. నిండు నూరేళ్ళ జీవితాన్ని ఆవిడ ప్రశాంతంగా ముగించారు.

అయినప్పటికీ, విషాదం విషాదమే కదా! కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ప్రతిపక్ష నేతలు, విదేశీ ప్రభుత్వాధి నేతలు మొదలైన అనేకమంది ప్రముఖులు పెద్దసంఖ్యలో 'సంతాపం' తెలుపుతూ ప్రకటనలు చేశారు.

తమ సంతాపాలను ప్రధాని నరేంద్రమోడీకి నేరుగా ఫోన్‌చేసి తెలుపలేదు. ఓ ఉత్తరం అయినా రాయలేదు. ట్విట్టర్‌లో ట్విట్టారు. ప్రసార మాధ్యమాల వారు వాటిని అందిపుచ్చుకుని... మనకు చేరేశారు. అందుకని అంతమంది ప్రముఖులు ఆ మాతృమూర్తి కాలం చేయడం పట్ల సంతాపం వ్యక్తం చేశారని మనకు తెలిసింది. లేకపోతే, అదీ తెలిసేది కాదు.

రేప్పొద్దున... ప్రధాన మంత్రిత్వం ముగిసిన రోజున... ఏ హిమాలయ పర్వతాలకో వెళ్లి... తన తల్లి మృతి పట్ల ఎవరు ప్రగాఢ సంతాపం తెలుపుతూ ఉత్తరం ముక్క రాశారో అని నరేంద్ర మోడీ వెనక్కి తిరిగి చూసుకుంటే... ఒక్కరి పేరు కూడా గుర్తుకు రాదు.

అంటే... ఫలానా ఫలానా వారు... ఫలానా వారి మరణం పట్ల 'ప్రగాఢ' సంతాపం వ్యక్తం చేశారనే విషయం అసలు బాధితులకంటే, టీవీ ప్రేక్షకులకే ముందుగా తెలుస్తోంది. నరేంద్ర మోడీ కూడా టీవీల ద్వారానే తెలుసుకుని ఉంటారు.

మన రాష్ట్రం విషయానికి వస్తే.. ప్రతిరోజూ ఏదో ఒక సందర్భంలో... ఏదో ఒక కారణంగా... ఏదో ఓ మూలలో... ఎవరో ఒకరి చేతుల్లో... ఎవరో ఒకరో... పలువురో... అకాల మృత్యువు పాలవుతూనే ఉంటారు.

ముఠా కక్షల్లో కావచ్చు... రాజకీయ ప్రత్యర్థుల చేతుల్లో కావచ్చు... పోలీసుల చేతుల్లో కావచ్చు... రోడ్డు, రైలు ప్రమాదాల వల్ల కావచ్చు, గృహ దహనాల వల్ల కావచ్చు, నీటి కొలనులు, సముద్ర బీచ్‌లలో స్నానాలకు వెళ్లి కావచ్చు.... కొత్తగా ఇప్పుడు తొక్కిసలాటల్లో కావచ్చు... కరోనా వల్ల కావచ్చు... డాక్టర్లకు వైద్యం తెలియక కావచ్చు... డొనేషన్ డాక్టర్ల చేతుల్లో కావచ్చు... ఎలా అయినా మరణం రావచ్చు కదా! ఎలా అనేది చెప్పి రాదు కదా!

వెయ్యి కోణాల్లో మనల్ని అది ఆవహించవచ్చు. ఏ కారణం వల్ల ఎవరు, ఎప్పుడు, ఎందుకు, ఎలా మృత్యువు పాలవుతారో చెప్పలేం.

మొన్నీమధ్య చంద్రబాబు రోడ్డు షోకి కందుకూరులో జరిగిన తొక్కిసలాటలో ఏకంగా ఎనిమిది మంది చనిపోతారని ఎవరైనా ఊహించారా? చనిపోయారు.

నిజానికి, సంతాప సందేశాలనేవి... మృతుల కుటుంబసభ్యులకు కొండంత మనోబలాన్ని ఇస్తాయి. ఊరట కలిగిస్తాయి.

'మా ఇంట్లో విషాదం చోటు చేసుకుంటే... ఫలానా వారు సంతాపం వ్యక్తం చేశారు' అనే భావన వెల కట్టలేనిది.

అయితే, చాలా సందర్భాలలో... తాము ఎవరికి సంతాపాలు ప్రకటిస్తుంటామో ఆయా నేతలకు కూడా తెలియదు. తమకు పరిచయస్తులు కాకపోయినా... 'ప్రగాఢ' సంతాపాలు ప్రకటిస్తూ ఉంటారు.

ఎవరో... ఎక్కడో... ఎలానో చనిపోయినట్టు టీవీల్లో వస్తుంది. వెంటనే ఒక సంతాప సందేశం విడుదల చేస్తారు. వీటిని 'ఉత్తుత్తి' 'ప్రగాఢ' సంతాపాలుగా వర్గీకరించవచ్చు. ప్రచారానికి మాత్రమే పనికివస్తాయి.

సంతాపం వ్యక్తం చేసేవారికి... బాధిత కుటుంబాల వారు కూడా నూటికి తొంభై సందర్భాలలో తెలియరు. అలాగే, బాధిత కుటుంబాల వారికి ఆ 'సంతాప రాయుళ్లు' ఎవరో తెలియదు.

ఎవరి మరణానికి అయినా ఓ సంతాపం ప్రకటించ గలిగిన స్థాయి కలిగిన రాజకీయ వాదికి... సహజంగానే వ్యక్తిగత సిబ్బంది ఉంటారు. ఆయా రాజకీయ వాదుల తరఫున వారే ఓ సంతాప సందేశం రాసేసి, మీడియాకు విడుదల చేస్తుండడం కూడా కద్దు.

వీటన్నిటినీ 'ఉత్తుత్తి' సంతాప సందేశాలుగా భావించవచ్చు.

వివిధ సందర్భాలలో మృత్యువు పాలైనవారి కుటుంబాలకు నిజమైన సంతాపం తెలిపే పద్ధతి లేకపోలేదు.




బాధిత కుటుంబాల సభ్యులను స్వయంగా కలిసి, వారికి ధైర్యం చెప్పి, తమ విచారాన్ని తెలియచేయడం ఒక పద్ధతి.

అయితే, ఇలా చేయడం అన్ని వేళలా సాధ్యం కాకపోవచ్చు.

అటువంటి సందర్భాలలో, తమ సంతాపం వ్యక్తంచేస్తూ కుటుంబపెద్ద పేరిట ఒక ఉత్తరం రాసి... తమ సిబ్బందితో కానీ, అనుయాయులతో కానీ పంపించడం మరో పద్ధతి. బాధిత కుటుంబం ఆ ఉత్తరాన్ని ఎంతో భద్రంగా దాచుకుంటుంది. ఫలానా వారు సంతాపం వ్యక్తం చేశారు అనుకుంటూ ఊరట పొందుతుంది. చుట్టాలు, పక్కాలకు చెప్పుకుంటుంది.

అది నిజమైన సానుభూతి.

కందుకూరులో చంద్రబాబు సభలో జరిగిన తొక్కిసలాటలో మృతుల కుటుంబాలకు ఎంతమంది నాయకులు, ప్రముఖులు 'ప్రగాఢ' సంతాపాలు తెలిపారో... ఆ కుటుంబాల వారికి కూడా గుర్తు ఉండి ఉండదు.

మళ్ళీ మొన్న ఆదివారం గుంటూరులో చంద్రబాబు సభ అనంతరం జరిగిన చీరల పంపిణీ కార్యక్రమంలో జరిగిన 'తొక్కిసలాట'లో ఓ ముగ్గురు మహిళలు చనిపోయారు.

మొన్న సోమవారం నాడు, యూ ట్యూబ్‌లో 'కుండ బద్దలు' పేరిట 'రాజకీయ విశ్లేషణలు' చేసే కాటా సుబ్బారావు అనే యూట్యూబర్ చనిపోయారు.

'ప్రగాఢ' సంతాప ప్రకటనలు... షరా మామూలే.

కానీ, సంతాపాలు వ్యక్తం చేయాల్సి ఉన్న నేతలు, ఇతరులు... ఒక ఉత్తరం ద్వారా తమ సంతాపాలను బాధిత కుటుంబాల వారికి తెలియచేయడం ఒక మంచి పద్ధతి.

లేకపోతే, మౌనంగా ఉండడం ఉత్తమం.

కానీ, అనుకోని దురదృష్టకర పరిస్థితుల్లో మరణాలు చోటు చేసుకున్నప్పుడు.. సంతాపాల కంటే, రాజకీయాలది పైచేయి అవుతోంది. ఆ దురదృష్టకర సంఘటనల నుంచి రాజకీయ లబ్ది పొందాలనే యావ ఎక్కువగా కనబడుతోంది.

ఎదురుగుండా అసెంబ్లీ ఎన్నికలు లేకపోయి ఉన్నట్టయితే కందుకూరు తొక్కిసలాట బాధిత కుటుంబాలను పట్టించుకునే వారే ఉండేవారే కాదు. కానీ, ఓ ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయనే స్పృహ ఉండడంతో పాటు ఇప్పటికే 'ఎన్నికల మూడ్'లోకి వెళ్లిపోవడం వల్ల చంద్రబాబునాయుడు... ఆ బాధిత కుటుంబాల వారి ఇళ్లకు వెళ్లారు. చెక్కులు అందజేశారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటాను అన్నారు. వారి పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూల్స్‌లో ఉచితంగా చదివిస్తాను అన్నారు.

అయితే, గుంటూరులో జరిగిన తొక్కిసలాట మృతుల ఘటనలో ఈ స్థాయి స్పందన ఆయన నుంచి వ్యక్తం కాకపోవడం ఆశ్చర్యం కలిగించింది. బహుశా, 'ఉయ్యూరు ఫౌండేషన్'దే బాధ్యత అని చంద్రబాబు అనుకుని ఉంటారు. ఉత్తి 'ప్రగాఢ సంతాపం'తో సరిపెట్టారు.

ఈ 'తొక్కిసలాట' రాజకీయ రంగు పులుముకుంది. 'మీరు చంపారు అంటే... మీరు చంపారు' అనే ఆరోపణల బురదను బకెట్ల కొద్దీ పరస్పరం చల్లుకుంటున్నారు. నిజమేమిటో మృతులకు తెలుసు కానీ... వారు చెప్పలేరు కదా!

ఏమైతేనేం, 150 రూపాయల ఖరీదు చేసే చీరల కోసం ఎగబడి, 'తొక్కిసలాట'లో చనిపోయిన వారి కుటుంబాల వారికీ పాతిక లక్షలు పరిహారం అందుతోంది. రానున్న ఎన్నికల పుణ్యమే అది.

'అసెంబ్లీ ఎన్నికలు' అంటే గుర్తొచ్చింది, ఎన్నికల లోపు... 'తొక్కిసలాట'లో ముందు ముందు చాలామంది చనిపోవచ్చు.

చంద్రబాబు సభల్లోనూ, లోకేష్ పాదయాత్ర జరిగితే కనుక ఆ పాదయాత్రలోనూ 'తొక్కిసలాట'లో చాలామంది చనిపోయే అవకాశం లేకపోలేదు.

ఇది కొత్త కాన్సెప్ట్. కరోనాలో కొత్త కొత్త వేరియంట్‌లాగా... ఆంధ్ర పాలిటిక్స్‌లో 'తొక్కిసలాట'లో మృతి చెందడం అనేది కొత్త వేరియంట్.

అలా, 'ఎన్నికల ముందు జరిగే తొక్కిసలాట'ల్లో చనిపోయిన వారి కుటుంబాల వారు అదృష్టవంతులే. తెలుగుదేశం పార్టీ, దాని నాయకులు, శ్రేయోభిలాషులు, టికెట్ ఆశావాహులు కలిపి... పాతిక లక్షల రూపాయలకు తక్కువ లేకుండా 'నష్ట'పరిహారం అందజేస్తారు. ఎన్నికలు అయిపోయిన తరువాత... ఏ కారణం వల్ల అయినా చనిపోయారో... ఇక చచ్చినట్టే! ఉత్తి 'ప్రగాఢ' సంతాపాలే. అవి దమ్మిడీ విలువ చెయ్యవ్!

2001లో మచిలీపట్నంలో మా తండ్రి గారు చనిపోయారు (సహజ మరణమే. తొక్కిసలాట కాదు). మేమంతా మచిలీపట్నంలో సంతాప పరిస్థితుల్లో ఉన్నాం (ఇంకా పెద్దకర్మ చేయలేదు). పోస్ట్‌లో ఓ ఉత్తరం వచ్చింది, నా పేరిట. చింపి, చూస్తే... మా తండ్రి గారి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ వచ్చిన ఉత్తరం అది.

దానిని రాసినవారు అసెంబ్లీలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి.

ఈ విషయం 21 ఏళ్ళ తరువాత కూడా మా కుటుంబానికి గుర్తు ఉంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

### జిల్లాలో తొలిసారిగా ప్రభుత్వోద్యోగుల వైద్యానికి

# నెల్లూరు పెద్దాసుపత్రిలో.. ప్రత్యేక వార్డు

ప్రభుత్వోద్యోగులకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల నెల్లూరు పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటుచేశారు. జిల్లాలో దాదాపు 20వేల మంది ప్రభుత్వోద్యోగులకు ఉపయోగంగా ఉండేలా, ఇహెచ్ఎస్ వర్తించే ఉద్యోగుల కోసం స్పెషలిస్టు డాక్టర్లతో ఈ ప్రత్యేక వార్డును ఏర్పాటుచేయడం విశేషం. ఇందులో ఓపి, ఇన్‌పేషెంట్ల విభాగాలు నెలకొల్పి, వాటిలో స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా ఓపీ విభాగం వద్దనే ల్యాబ్, మందుల విభాగాన్ని కూడా ఏర్పాటు చేయడంతో వైద్యసేవలకు వచ్చే ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దాదాపు 24 రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఇక్కడ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ విభాగాలను వచ్చే వారం నుంచే ప్రారంభించనున్నట్లు పెద్దాసుపత్రి వర్గాలు తెలిపాయి.


## 'వైకుంఠ ఏకాదశి' ఒక్క రోజునే... రంగనాథస్వామికి 19.12 లక్షల ఆదాయం

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయానికి 'వైకుంఠ ఏకాదశి' ఒక్కరోజునే టిక్కెట్ల విక్రయం, భక్తుల కానుకల ద్వారా మొత్తంగా 19,12,475 రూపాయల రాబడి వచ్చింది. ఇది గత ఏడాది కంటే రెట్టింపుగా ఉండడం విశేషం. ఇందులో హుండీల ద్వారా 7,34,625 రూపాయలు, దర్శన టికెట్ల ద్వారా 11,77,850 రూపాయలు వచ్చాయి. హుండీల లెక్కింపును ఈనెల 4న ఆలయ ఛైర్మెన్ శివకుమార్, ఇఓ వెంకటేశ్వర్లు, దేవాదాయశాఖ అధికారి జి.రవీంద్రరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com